# గోవిందపథం

(అలనాటి తిరుమల దివ్యగాథలు)

రచన

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

శ్రీం

శ్రీ డిజైన్స్


www.lordofsevenhills.com
Phone : 9849443752
హైదరాబాదు
2016


# గోవిందపథం

(అలనాటి తిరుమల దివ్యగాథలు)

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి


C సర్వహక్కులు రచయితవి.



First Edition : 2016

వెల : అమూల్యం


తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలు
ఈ వెబ్‌సైట్‌ల నుంచి ఉచితంగా ప్రింట్ చేసుకొనవచ్చును.

**www.lordofsevenhills.com**
**www.vratams.com**


**T.V.R.K. MURTHY,** M.Tech
Flat No. 202, Plot No. 11, Sai's Arunodaya Apartments,
Sunder Nagar Colony, Near Erragadda,
HYDERABAD - 500 038, India.
Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com, shridesigns@gmail.com

# నివేదన

వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తికించన
వేంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి

ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రితో సమానమైన ప్రదేశం కానీ, వేంకటేశ్వరునితో సమానమైన దైవం కానీ ఇంతకుముందు కాలంలో లేదు, ఇకముందు కాలంలో ఉండబోదు... ఆ శ్రీనివాసుని దయవలన నేనిప్పటిదాకా ఇరవై నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలు రచించాను. ఇందులో పధ్నాలుగు ఆ స్వామిలీలలపైననే ఉండడం విశేషం. ఇదంతా ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొక్కటి కాదు. లేకపోతే అతి సామాన్యుడనైన నేనేమిటి? ఇన్ని పుస్తకాలు రాయడమేమిటి? ప్రపంచమంతటా ఇంతమంది భక్తులను అలరించటమేమిటి?

ఆ శ్రీనివాసునికి తన భక్తులంటే అత్యంత ప్రేమ. మనం అహంకారాన్ని, ఈ ఇహలోక విషయాలపై మమకారాన్ని వదిలి ఆ స్వామిని ప్రార్థిస్తే అన్నీ తనే చూసుకుంటాడు. కలియుగంలో ఇంతకుమించిన దైవం మరొకరు లేరు. ఇందువలననే తిరుమలను రోజూ కొన్ని వేలమంది దర్శిస్తూ, స్వామివారిని సేవిస్తున్నారు.

తిరుమల అద్భుత పవిత్ర ప్రదేశం. తిరుమలలో మనం ఏకాంతంగా ఏ ప్రదేశం లోనైనా కూర్చుని కళ్ళు మూసుకుని ప్రశాంత చిత్తంతో ధ్యానిస్తే ఓంకారనాదం స్పష్టంగా వినిపిస్తుంది. మన హృదయాలలో ప్రతిధ్వనిస్తుంది. అంతేకాక వేదాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాల విశేషాలు వినిపిస్తాయి. ఇప్పటికీ ముక్కోటి దేవతలు, మహా మునులు అనేక దివ్య రూపాలలో సంచరిస్తున్న పవిత్ర ప్రదేశం తిరుమల. ఎన్నో జన్మల పుణ్యఫలం వలనే తిరుమలపై కాలు పెట్టే భాగ్యం, శ్రీవారి దర్శన భాగ్యం కలుగుతుంది.

శ్రీనివాసుని తర తరాలుగా ఎందరో భక్తులు కొలచి తరించారు. ఇంకా తరిస్తున్నారు. నేటికీ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తిరుమలయాత్రచేసి స్వామిని దర్శించే భక్తులు లక్షలలో ఉంటున్నారు. ఆ స్వామిలోని ఆకర్షణఅంతటి మహత్తరమైనది. ఎక్కడెక్కడినుంచో రెక్కలు కట్టుకుని ఆ స్వామి దర్శనార్థం వస్తారు. మనలో చాలామందికి ఆ స్వామి అసలు ఎప్పటినుంచి ఈ కొండపై ఉన్నాడు, తిరుమల ఆలయం మొదటిరోజులలో ఎలా ఉండేది, ఆ స్వామి సామాన్యభక్తులకు ఎప్పుడు దర్శనమిచ్చాడు. అసలు కొండమీదకు వెళ్ళడానికి ఈ రోడ్డు ఎప్పుడు నిర్మించబడింది? ఇలా అనేక సందేహాలు మన మనస్సులో మెదులుతాయి. తిరుమల గురించి, ఆ స్వామివారి గురించి ఏ విశేషం విన్నా మన శరీరం పులకరిస్తుంది. నేను కూడా వీటన్నింటి గురించి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడిని.

ఇలా ఉండగా ఒకనాటి రాత్రి నాకు ఒక అద్భుత దేవత కలలో ప్రత్యక్షమై శ్రీనివాసుడు ఈ కొండపై వెలసిన మొదటిరోజులలో ఎలా ఉండేదో చెప్పడం జరిగింది. ఆ కల అలా పదిరోజులపాటు వచ్చింది. ఆ దేవత ప్రతీరోజు కలలో కనపడి నన్ను ఆ రోజులలోనికి తీసుకువెళ్ళి కొండపై అప్పుడు జరిగిన అనేక విశేషాలు చెప్పారు. అవన్నీ తలచుకుంటే నా శరీరం గగుర్పొడుస్తుంది. ఇదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొక్కటి కాదు. ఆ దివ్య విశేషాలు, దివ్య అనుభూతులు మీతో కూడా పంచుకోవాలనిపించి ఈ పుస్తకం రాయడం జరిగింది.

ఈ విశేషాలన్నీ చదివిన మీకు కూడా ఎంతో ఆనందం కలుగుతుందని నా నమ్మకం. ఆ స్వామి గురించి ఏది చదివినా, ఏది విన్నా శరీరం అంతా ఆనందంతో ఉప్పొంగుతుంది. ఆ స్వామి వారి దివ్యతత్వం అంతటి మహత్తరమైనది. ఈ పుస్తక ప్రచురణలో డాక్టర్ రాకేష్ కలపాల, డాక్టర్ అఖిల మరియు అనేక మంది స్వామివారి భక్తులు సహకరించారు. వారందరికీ నా కృతజ్ఞతలు. వారికీ, మీకు ఆ శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

**శ్రియఃకాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్**
**శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్**
**సమస్త సన్మంగాళానిభవంతు ః**
**సర్వేజనా సుఖినోభవంతు**

హైదరాబాద్. తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
03-10-2016

# ఈ పుస్తకం ఎలా చదవాలి

భగవంతుడికి సంబంధించిన ఏ పుస్తకమైనా చదవడానికి ఎటువంటి నియమ నిబంధనలు వుండవని నా విశ్వాసం. వయస్సుతోగానీ, కులంతో గానీ, ఏ నిమిత్తమూ లేదు. మనస్సు నిర్మలంగానూ, శరీరం శుభ్రంగానూ ఉంటేచాలు. ఎవరైనా, ఏరీతిలోనైనా, ఏరోజైనా, ఏప్రదేశంలోనైనా చదువుకొనవచ్చును. ఆ శ్రీమన్నారాయణుని గురించిన పుస్తకం చదవడానికి కావలసినది నిర్మల భక్తి తప్ప మరొకటి కాదు. ఎటువంటి కఠోర నిష్టలు, ఉపవాసాలు అవసరం లేదు.

ఇకపోతే భగవంతునికి సంబంధించిన స్తోత్రాలకు, పారాయణగ్రంథాలకి కొన్ని కొన్ని ప్రత్యేక పర్వ దినాలలోను, వైకుంఠ ఏకాదశి లాంటి పవిత్ర దినాలలోనూ చదివితే తప్పకుండా ఫలితం రెట్టింపుగా ఉంటుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు.

ఏకాదశి శ్రీనివాసునికి అత్యంత ప్రీతికరమైనది. ప్రతీ ఏకాదశి తిథినాడు చదివినవారికిస ర్వసౌభాగ్యాలూల భిస్తాయి. ఎ టువంటిఅ నారోగ్యముద రిచేరదు. అలాగే ప్రతీనెలా శ్రవణా నక్షత్రం నాడు చదివినవారికి సర్వ ఐశ్వర్యాలూ కలుగుతాయి. శరీరము, వయస్సు సహకరిస్తే కనీసం సంవత్సరంలో ఏ ఒక్క ఏకాదశినాడైనా చదివితే మరు జన్మ ఉండదు. జీవించినంతకాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందుతారు. వైకుంఠ ఏకాదశినాడు ఈ పుస్తకం చదివితే చాలా విశేషం. అలాగే శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన ఏ పర్వదినాలలో చదివినా విశేష ఫలం లభిస్తుంది.

అలాగే ప్రతీరోజు ఉదయము లేచి స్నానాదులు పూర్తి చేసిన తరువాత కనీసం ఒక్క అధ్యాయమైనా చదివితే ఆరోజంతా ఎంతో జయప్రదంగా గడుస్తుంది. ఆ రోజు తలపెట్టిన పనులన్నీ నిర్విఘ్నంగా, జయప్రదంగా పూర్తవుతాయి.

అనారోగ్యంతో ఉన్నవారు ఈ పుస్తకం చదివితే తప్పక సంపూర్ణ ఆరోగ్య వంతులౌతారు. మనస్సు ఏ కారణం చేతనైనా ప్రశాంతంగా లేనప్పుడు చదివితే పూర్తి ప్రశాంతత వెంటనే లభిస్తుంది.

ఎటువంటి కష్టాలలో వున్న వారైనా వారం రోజులపాటు ఈ పుస్తకాన్ని పారాయణచేస్తే అన్ని కష్టాలూ తొలగిపోయి సర్వసౌభాగ్యాలనూ పొందుతారు. మీకెప్పుడైనా ఏదైనా సమస్య కలిగినప్పుడు ఈ పుస్తకంలోని ఏ ఒక్క అధ్యాయం చదివినా వెంటనే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఏ దేవాలయంలోనైనా కూర్చుని చదువుకుంటే చాలా పుణ్యప్రదం. తిరుమలలో చదివినవారికి వేయి అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది.

ముందు చెప్పినట్లుగా ఈ పుస్తకం చదివేటప్పుడు ఎటువంటి కఠోర నియమ నిష్టలు అవసరం లేదు. మీరున్నచోటనే, మీకు వీలున్నట్లుగా కూర్చుని నిర్మల మనసుతో చదివితే చాలు. ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా చదవవచ్చును. ఈ పుస్తకం సర్వవేళలా మీతోనే ఉంచుకుని మనస్సుకు ఎప్పుడు తోచితే అప్పుడు ఏ అధ్యాయమైనా తీసుకుని చదువుకొనవచ్చును.

ఈవిధంగా మీకు వీలున్న ఏ రోజైనా, ఏ రీతిలోనైనా చదివి శ్రీనివాసుని అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యంతో, సర్వ సంపదలతో కలకాలం సుఖముగా జీవించవచ్చును.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !

– తిమ్మరాజు విశ్వపతిరామకృష్ణమూర్తి.

# అంకితము

నా తల్లిదండ్రులు కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు, కీ॥శే॥ శ్రీమతి నాగరత్నాంబ గారల ప్రీత్యర్థముగా తిరుమల శ్రీ శ్రీనివాసుని దివ్య చరణారవిందములకు నా ఈ 'గోవిందపథం' గ్రంథమును భక్తితో సమర్పిస్తున్నాను.

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

## గోవింద పథం

## మొదటి అధ్యాయం

# అదివో అల్లదివో శ్రీహరివాసము ...

తిరుమల... ఆ పేరు తలచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తుంది. శ్రీనివాసుడు... ఆ పేరు మదిలోకి రాగానే ఒళ్ళంతా ఒక అద్భుత ఆనందంతో నిండిపోతుంది. ముందు ఆనందం... తరువాత భక్తిభావం... భక్తులందరికి ఇది అనుభవైకవైద్యమే! శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తలచుకోగానే మనం మాటలలో వర్ణించలేని దివ్యమైన ఆనందం కలుగుతుంది. తిరుమల కొండలన్నీ మన మనస్సులో దివ్యరూపంలో కనిపిస్తాయి. ఒళ్లంతా పరవశిస్తుంది. ఆ స్వామిగురించి మనకు జరిగిన అనుభవాలన్నీ ఒక్కసారికి గుర్తుకు వస్తాయి. ఇదే ఆ స్వామిలోని అలౌకికమైన ఆకర్షణ.

తిరుమలకొండపై వెలసిన శ్రీనివాసుడు దివ్య మంగళ మనోహర మూర్తి. ఆ స్వామిలోని ఈ అద్భుత ఆకర్షణే ఎంతెంత దూరాలనుంచో భక్తులందరినీ తిరుమలవైపుకు నడిపిస్తుంది. ఉరుకు పరుగులమీద రప్పిస్తుంది. అసలు వైష్ణవతత్వం ఏమంటుందంటే ఈ సృష్టిలో అందరూ స్త్రీలే! శ్రీమన్నారాయణుడు ఒక్కడే పురుషుడు! అందుకే కాబోలు ఈ సృష్టి మొత్తం తిరుమల కొండలవైపు ఆకర్షింపబడుతుంది. మనుషులేమిటి? సర్వ



క్రిమికీటకాలు, సర్వ జంతుజాలము, అద్భుత తిరుమల కొండలవైపే ఆకర్షింపబడుతోంది... ఇంతేకాదు ... సమస్త ప్రాణికోటి, సర్వదేవతా గణమూ, యక్ష, కిన్నెర, కింపురుష గణాలు అందరూ ఈ స్వామి చెంతకు రావాలని, ఎప్పుడూ ఇక్కడే ఉండాలని ఉవ్విళ్ళూరుతుంటారు.

తిరుమల కొండల సౌందర్యం ఇంతా, అంతా అని వర్ణించలేము. వైకుంఠంలోని శ్రీమన్నారాయణులవారు తమ భక్తులను అనుగ్రహించడానికి కలియుగంలో భూమిపై అవతరిద్దామని తలచి ఆ విషయం తన ప్రియభక్తుడైన గరుత్మంతులవారితో చెప్పారు. అప్పుడు గరుత్మంతులవారు వాయువేగంతో భూలోకానికివచ్చి భూలోకమంతా శ్రీ స్వామివారి నివాసానికి అనుకూల స్థలం కోసం వెతకసాగాడు, సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే నివసించబోయే స్థలం ఎంత పవిత్రమైనదై ఉండాలి? ఎంత అద్భుతమైనదై ఉండాలి? గరుత్మంతులవారు అంతటి దివ్యప్రదేశం కోసం ఎన్నో కొండలు, గుట్టలు, నదీ పరీవాహక ప్రాంతాలు సముద్ర సమీపంలోని అత్యంత అద్భుతప్రదేశాలను చూశారు. కొన్ని ఎంతో అద్భుత ప్రకృతి సౌందర్యానికి ఆలవాలమై ఉన్నాయి. కానీ ఏదో లోటు కనిపించింది. మళ్ళీ వెదకడం కొనసాగించాడు.

ఆ విధంగా భూలోకమంతా విహరిస్తున్నా గరుత్మంతునికి ఏ ప్రదేశమూ శ్రీమన్నారాయణులవారి దివ్యధామానికి తగినదని తృప్తినీయలేదు. సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడే నెలవుండే అదృష్టానికి నోచుకునే ప్రదేశం ఏది? అంతటి దివ్య ప్రదేశం ఈ భూమండలంలో ఏమూల ఉన్నది? ఇలా తలుస్తూ గరుత్మంతులవారు వెదకసాగారు. అప్పుడొక ప్రదేశం చాలా అద్భుతంగా ఉందనిపించి కాసేపు అక్కడకు దిగారు. కానీ కొద్దిసేపటికే ఆ ప్రదేశంలో మనస్సుకు అంత ప్రశాంతంగా ఉందని అనిపించలేదు. తిరిగి రివ్వున ఎగిరి ముందుకు సాగారు. ఇలా ఎన్నో ప్రదేశాలు చూసినప్పటికీ తన స్వామికి సరిపడే ప్రదేశం ఏదీ కనపడక ఎంతో నిరాశపడ్డారు. ఇక లాభం లేదని తలచి వెనుతిరుగుదామని అనుకున్నారు.

ఇంతలో గరుత్మంతులవారి దృష్టిలో ఎంతో దూరంలో ఒక అద్భుత పర్వతశ్రేణి కనిపించింది. వెంటనే రివ్వున అక్కడికి వెళ్ళాడు. ఆహా! ఎంత దివ్యంగా

ఉంది ఈ దివ్య పర్వతసమూహం?... ఎన్నో రకాల పండ్ల చెట్లు, ఎన్నో అద్భుతమైన రంగు రంగుల పూలమొక్కలు, ఒళ్ళు మైమరిపించే వృక్ష సముదాయం, ఆహా! ఎంత అద్భుతమైన ప్రకృతి సంపద! చెట్లపై రకరకాల పక్షుల కిలకిలారావాలు... రంగు రంగుల రామచిలుకలు... గోరింకలు, పావురాలు, ఒక ప్రక్క నెమళ్ళు, మరికొన్ని చెట్లపై కొంగలు, ఈ దృశ్యాలన్నీ ఎంతో అద్భుతంగా ఉన్నాయి, అంతేకాదు, ఎక్కడ చూసినా ఎన్నో దివ్యతీర్థాలు. ఒక్కొక్క తీర్థాన్ని మించి మరొక తీర్థం ఉన్నది. గరుత్మంతులవారు ఎన్నో రకాల మృగజాతులు కొండపై స్వేచ్ఛగా ఆనందంగా సంచరించటం చూశారు. ఎంతో సుమనోహరుడైన తన స్వామి శ్రీమన్నారాయణులవారికి కలియుగంలో వుండడానికి భూలోకంలో ఇది ఎంతో దివ్యప్రదేశంగా తోచింది. ఇప్పటిదాకా ఎన్నో అద్భుతమైన ప్రకృతి ఉన్న పర్వతసమూహాలు చూసినప్పటికీ దీనిలో ఏదో దివ్యశక్తి ఉన్నట్లు అనిపించింది. దీనితో సమానమైన అద్భుతప్రదేశం ఇంకెక్కడా లేదు. అద్భుతమైన ప్రకృతి సంపదతో, చక్కటి సెలయేర్లతో అలరారుతున్న ఈ పర్వత సమూహం శ్రీమన్నారాయణులవారి నివాసానికి ఎంతో అద్భుతంగా ఉంటుందని తలచాడు. గరుత్మంతులవారు ఎంతో ఆనందంతో తిరిగి వైకుంఠానికి పయనమైనాడు.

తిరుమల కొండలన్నీ బంగారు మయమే. ఈ కలియుగంలో కేవలం శిలలలాగా కనిపిస్తున్నప్పటికీ ఇదంతా బంగారుమయమే. అందుకే ఈ కొండను కనకాద్రి అని కూడా పిలుస్తారు. తిరుమలకొండపై కాలుపెట్టే భాగ్యం ఎన్నో జన్మల పుణ్యఫలం వలనకానీ కలుగదు. ఆ స్వామి దర్శనమూ మనకు లభించదు. ఎవరైతే ఎల్లవేళలా ఆ శ్రీనివాసునే మనస్సులో ప్రార్థిస్తూ, అర్చిస్తూ ఉంటారో వారికి సామీప్య, సారూప్య, సాయుజ్యాలు లభ్యమవుతాయి. సాయుజ్య స్థితిని చేరినవారికి జన్మరాహిత్యం కలుగుతుంది. ఇక ఉత్తర జన్మలు ఉండవు.

పూర్వకాలంలో గజపతి మహారాజు అనే రాజు ఉండేవాడు. అతడు ఎంతో విష్ణు భక్తుడు. ఎన్నో వైష్ణవ ఆలయాలను నిర్మించాడు. ఎంతో చక్కటి పరిపాలన చేశాడు. అయినా అతడు ఎన్నిసార్లు ప్రయత్నించినా తిరుమల యాత్ర మాత్రం చేయలేకపోయాడు. ఒకసారి తిరుమల వెళ్ళడానికి ఎన్నో సన్నాహాలు



చేసుకున్నాడు. అన్ని ఏర్పాట్లు పూర్తయినాయి. గుఱ్ఱాలతో ఉన్న అద్భుతమైన వాహనం ఎక్కి బయలుదేరబోయాడు. ఒక్కసారిగా ఆ గుఱ్ఱాలలో ఒకటి ఉన్నట్లుండి కాలు మెలికిపడి కిందపడింది. అక్కడితో ఆ వాహనం ఒక ప్రక్కకు ఒరిగి మహారాజు కిందపడటం జరిగింది. అతడి కాలి ఎముక విరిగింది. అక్కడితో తిరుమలయాత్ర వాయిదా వేసుకున్నాడు. తిరిగి మామూలుగా నడిచి వెళ్ళడానికి ఆరు నెలలు పట్టింది. అటు తరువాత సంవత్సరానికి తిరిగి బయలుదేరడానికి సన్నద్ధమయ్యాడు. ఇక రేపే బయలుదేరుతాడనగా గూఢచారులద్వారా పొరుగుదేశపు రాజు కొద్దిరోజుల్లో తమదేశంపై దండయాత్రకు రానున్నాడని కబురు వచ్చింది. అంతే మళ్ళీ ప్రయాణం మానుకున్నాడు. ఇలా ఐదారుసార్లు జరిగింది. ఎంతో భక్తిపరుడైన మహారాజుకు ఎందుకు శ్రీనివాసుని దర్శనం కలగట్లేదో మహామంత్రికి అర్థం కావటంలేదు.

ఒకనాడు శ్రీనివాసుడు మంత్రికి కలలో కనపడి రాజు కిందటి జన్మలలో చేసిన పాపఫలితంవలన ఈ జన్మలో ఎంత ప్రయత్నించినా తిరుమలకొండపై కాలుపెట్టే భాగ్యం లభించదని అన్నాడు. అయితే ఈ జన్మలో ఎంతో పుణ్యం చేసుకున్న ఫలితంగా వచ్చే జన్మలో అనేకమార్లు తనను దర్శించుకుంటాడని చెప్పాడు. మంత్రి ఈ విషయం మహారాజుకు విన్నవించటంతో మహారాజుకు ఇన్నిసార్లు ఎంత ప్రయత్నించినా ఎందుకు వెళ్ళలేకపోతున్నాడో అర్థమైంది. ఇక ఈ జన్మలో తనకు స్వామి దర్శనం కాదని ఎంతో బాధపడ్డాడు. అయినా జీవించినంత కాలం ఆ స్వామినే కొలుస్తూ ఎన్నో వైష్ణవాలయాలు కట్టించి చివరకు ముక్తిని పొందాడు.

తిరుమల ఈ సృష్టిలోకెల్ల అతి పవిత్రప్రదేశం. ఈ కొండపై ఇప్పటికీ ఎందరో దేవతలు నిత్యం సంచరిస్తుంటారు. వీరందరూ సామాన్య భక్తుల వలెనే మనమధ్య తిరుగుతూ ఉంటారు. మనం ఆ శ్రీనివాసుని తలచుకునే విషయాలు వినడంవీ రికిఎ ంతోఆ నందకరం. వ ఋనుపటికాలంలోతి రుమలకొండలన్నీ భయంకరమైన అడవులతో కూడి ఉండేవి. ఆలయం చుట్టుపక్కల కూడా ఎన్నో క్రూరమృగాలు సంచరిస్తూ ఉండేవి. అసలు చాలాకాలం స్వామి ఒక్కడే ఆ కొండపై

ఉండేవాడు. ముందు రోజులలో ఆ స్వామిని ఆటవికులు తమ దేవతగా ఆరాధించేవారు. చాలాకాలం వరకు ఆలయమే లేదు. అటుతరువాత కూడా అర్చకులు తిరుచానూరు నుంచి ఉదయం వెళ్ళి స్వామికి పూజచేసి మధ్యాహ్నంకల్లా కిందకు వచ్చేవారు. సాయంత్రంనుంచి ఆలయ పరిసర ప్రాంతాలలో పులులు, చిరుతపులులు, ఏనుగులు, అడవి పందులు తిరుగుతుండేవి.

ఇవన్నీ తలచుకుంటే మనకెంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఆ రోజులలో తిరుమలకొండ ఎక్కి స్వామిని దర్శించటం చాలా దుర్లభమైన పని. అప్పటికి ఇంకా తిరుపతి పట్టణం అభివృద్ధి చెందలేదు. తిరుచానూరులోని ఒక ఆలయంలో శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహం ఉండేది. భక్తులందరూ తిరుచానూరులోని ఆ స్వామిని దర్శించుకునేవారు. చాలా కాలం పాటు బ్రహ్మోత్సవాలు కూడా మొదటిరోజు కొండపై జరిపి తరువాత రోజులన్నీ తిరుచానూరులోనే నిర్వహించేవారు. ఆ రోజులలో కొండను ఎక్కి శ్రీ స్వామి వారిని దర్శించే యాత్రీకుల సంఖ్య నూటికి మించి ఉండేది కాదు.

తరతరాలుగా స్వామివారిని ఎందరో మహారాజులు దర్శించుకున్నారు. వారిలో శ్రీకృష్ణదేవరాయలు ఎంతో ముఖ్యుడు. ఏడుసార్లు స్వామిని దర్శించి శ్రీ స్వామివారికి ఎన్నో కానుకలు సమర్పించాడు. అలాగే ఎందరో రాజులు, ఎందరో జమీందారులు స్వామివారికి ఎన్నో కానుకలు సమర్పించారు. ఎందరో భక్తులు ఆ స్వామితోనే తమ జీవితం మొత్తం గడిపారు. వారికి శ్రీనివాసుడే సర్వస్వం. నమ్మినవారిని ఎల్లప్పుడూ కాపాడే ఆ శ్రీనివాసుడు ఎందరో భక్తులకు అపురూపమైన దేవత అయ్యాడు.

నేను ఆ శ్రీనివాసుని దయవలన స్వామిలీలలపై పధ్నాలుగు పుస్తకాలు రచించాను. ఇవన్నీ ఆ స్వామి అనుగ్రహంతో ఎన్నో దేశాలలోని భక్తులకు నిత్యపారాయణగ్రంథాలు అయ్యాయి. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో నాకు తెలిసిన ఎన్నో విశేషాలను ఈ గ్రంథాలలో పొందు పరిచాను. ఈ మధ్య ఒకనాడు నాకు కలలో ఒక దేవత ప్రత్యక్షమై తనతోపాటు నన్ను తిరుమల కొండలపైకి తీసుకువెళ్లడం జరిగింది. అయితే అక్కడ ఉన్న శ్రీ స్వామివారి ఆలయం



ఇప్పటిలాగలేదు. చాలా చిన్నదిగా ఉన్నది. అప్పుడు ఆ దేవత నాతో ఒకానొక కాలంలో తిరుమల ఎలా ఉండేదో వివరంగా చెప్పసాగారు. ఆ విశేషాలన్నీ వింటుంటే నా ఒళ్ళు జలదరించింది. ఎంతో ఆనందంతో పులకించింది. శ్రీమన్నారాయణులవారికి అతి ప్రీతికరమైన తిరుమల విశేషాలను ఆ దేవత వివరంగా చెబుతుంటే నాకెంతో సంతోషం కలిగింది. ఇదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఆ దేవత ఆవిధంగా పదిరోజులపాటు కలలో దర్శనం ఇచ్చి శ్రీనివాసుని దివ్య లీలల గురించి వేంకటాద్రి పర్వత విశిష్టత గురించి ఎన్నో విశేషాలు చెప్పారు. వీటన్నింటిని శ్రీ స్వామివారి భక్తులతో పంచుకొనడానికి మించిన ఆనందం ఏముంటుంది? ఆ కలలో ప్రతిరోజు ఆ దేవత నన్ను కొన్నివేల సంవత్సరాలక్రితం తిరుమల ఉన్న కాలంలోనికి తీసుకువెళ్ళారు. అలా ఆ కొండలపై విహరిస్తుంటే నా శరీరమంతా ఎంతో ఆనందంతో పరవశించింది. మరునాడు రోజంతా కూడా ఆ విశేషాలే నా మదిలో తిరుగుతుండేవి. ముందు ముందు అధ్యాయాలలో ఆ దేవత చెప్పిన విశేషాలను మీతో ఆనందంగా పంచుకుంటున్నాను. మీ అందరికీ అవి ఎంతో ఆనందదాయకమవుతాయని నా నమ్మకం.

కో అంటే పలికే కొండలరాయుడు శ్రీనివాసుడు. నమ్మినవారికి కొంగు బంగారం. శరణన్నవారికి ఆప్తబంధువు. ఆశ్రితజన రక్షకుడు. ఎంతటి పాపాత్ములనైన ఒక్క పిలుపుతోనే అనుగ్రహించే అమృతహృదయుడు. ఆత్మస్వరూపుడైన శ్రీ వేంకటేశ్వరుడు శరణుకోరి తనను ఆశ్రయించిన భక్తులను కనికరించి, ఆదరించి వారిపై తన కృపాకటాక్షధారలు కురిపిస్తాడు. నిరాకారుడు, నిష్కళంకుడు, నిరంజనుడు, నిత్యానందుడు, నిత్యప్రకాశుడు, నిత్యసత్యుడు అయినటువంటి ఆ శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన ఈ వేంకటాద్రి మహా మహిమాన్వితమైనది.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

## రెండవ అధ్యాయం

# వేదములే శిలలై వెలసినదీ కొండ ...

ద్వాపరయుగం పూర్తయి, కలియుగం ప్రారంభమయ్యే సమయం వచ్చింది. శ్రీకృష్ణ పరమాత్మ అవతార పరిసమాప్తి ఇక కొద్ది గంటలలో కాబోతున్నది. పధ్నాలుగు లోకాలలోని దేవతలందరు శ్రీమన్నారాయణులవారు ఇక తన శ్రీకృష్ణావతారం చాలిస్తున్నారని తెలిసి ఎంతో ఆందోళన చెందారు. రాబోయే కలియుగాన్ని తలచుకుని వారందరిలో ఎంతో ఆందోళన కలిగింది. కలియుగంలో మానవులు ఎన్నో పాపాలు చేసి అనేకబాధలు పడతారు. ద్వాపరయుగంలోనే ధర్మాచరణచాలా తగ్గింది. ఇక కలియుగంలో అధర్మం విజృంభిస్తుంది. పాపాలు చేసేవారు ఎక్కువవుతారు. కలియుగంలో మొదటి నూరు సంవత్సరాలు మాత్రమే ధర్మాచరణకొద్దిగా ఉంటుంది. అటు తరువాత పూర్తిగా క్షీణిస్తుంది. ఒక వేయి సంవత్సరాలు గడిచేటప్పటికి భూమండలంపై పరిస్థితి అత్యంత ఘోరంగా ఉండబోతోంది. ఇవన్నీ తమ దూరదృష్టితో చూసిన దేవతలకు ఎంతో బాధ కలిగింది. రాబోయే కలియుగంలో పాపాత్ములవలన ఎందరో పుణ్యాత్ములు సైతం ఒక్కొక్కసారి అనేక బాధలు పడుతుంటారు. అటువంటి పుణ్యాత్ములను కాపాడేవారెవరు?



ఇలా దేవతలందరూ అనేక విధాల ఆలోచింపసాగారు. అందరూ కలిసి వైకుంఠంలోని శ్రీమన్నారాయణులవారి వద్దకు వెళ్లి ఇదే విషయం శ్రీ స్వామివారిని అడిగారు. అప్పుడు శ్రీమన్నారాయణులవారు దేవతలను ఏమీ అధైర్యపడవద్దని కలియుగం ప్రారంభం కాగానే తాను భూమిపై అవతరిస్తానని అన్నారు. ద్వాపరయుగం పూర్తికాగానే కలియుగ ప్రారంభంలోనే భక్తులను రక్షించడానికి తాను వేంకటాద్రిపై అర్చామూర్తిగా వెలుస్తానని అన్నాడు. ఇది విన్న దేవతలు ఎంతో సంతోషించారు. శ్రీమన్నారాయణులవారు ఇలా సెలవిచ్చిన కాసేపటికే పెద్ద ప్రళయం సంభవించి భూమి మొత్తం నీట మునిగిపోయింది. శ్రీకృష్ణావతార సమాప్తి అయింది. ద్వారక వంటి అద్భుత నగరాలన్నీ సముద్రగర్భంలో మునిగిపోయాయి. అప్పుడు శ్రీకృష్ణులవారి భౌతిక శరీరం ఆ నీటిపై తేలుతూ తిరుమలకొండలపైకి వచ్చి ఒక్కసారిగా అంతర్ధానమైంది. వెంటనే అక్కడ అద్భుత తేజస్సుతో వెలుగుతున్న ఒక దివ్యమూర్తి శిలారూపంలో ఉద్భవించాడు. అదే కాలక్రమేణశ్రీనివాసునిగా, శ్రీ వేంకటేశ్వరునిగా ప్రసిద్ధి చెందిన దివ్య తేజో రూపం.

ఇదంతా పధ్నాలుగు లోకాలలో ఉన్న దేవతలు చూశారు. వారందరికీ ఎంతో ఆనందం కలిగింది. ఆ శిలారూపం అద్భుత విష్ణు తేజస్సుతో ప్రకాశిస్తోంది. సముద్రాలన్నీ తిరిగి వెనక్కి వెళ్ళాయి. తమ ఉగ్రరూపం ఉపశమించాయి. ఎక్కడెక్కడి లోకాలనుంచో దేవతలందరూ వచ్చి వేంకటాద్రి చేరుకున్నారు. శ్రీమన్నారాయణులవారు తమకు చెప్పినవిధంగా ఈ కొండపై అవతరించారని గ్రహించారు. ఆ అద్భుత పర్వతశ్రేణిని చూసి అక్కడ ప్రకృతి సౌందర్యాన్ని చూసి దేవతలందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఎంతో అందమైన పూతోటలతో, దివ్యమైన ఫలాలు ఉన్న వృక్షాలతో వేంకటాద్రి చూడగానే కంటికి ఎంతో ఇంపుగా ఉంది.

శ్రీమన్నారాయణులవారు కలియుగంలో భక్తులకు అనుగ్రహించడానికి వేంకటాద్రిపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలిశాడని తెలిసిన దేవతాగణమంతా ఎంతో సంతోషపడ్డారు. అప్పుడు బ్రహ్మదేవుడు గొప్ప ఉత్సవం జరిపించాడు. అందులో దేవతలందరూ ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఉత్సవాలు పూర్తవగానే

ఎవరిలోకాలకు వారు వెళ్ళిపోయారు. అయితే కొందరు దేవతలు మాత్రం స్వామిని ఒంటరిగ వదిలి వెళ్ళటం ఇష్టంలేక ఇక్కడే ఈ తిరుమలకొండలపైనే కొంతకాలం ఉండదల్చారు. ఇలా నూట పదహారు మంది దేవతలు చాలాకాలం పాటు తిరుమలపైననే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వారు ఉదయాన్నే స్వామివారి దగ్గరకు వచ్చి ఆ దివ్యమంగళ మనోహర మూర్తిని ఎన్నో స్తోత్రాలతో స్తుతించేవారు. శేషాచల అడవులనుంచి అద్భుతమైన ఫలాలను తెచ్చి నివేదించేవారు. ఒకరోజు దానిమ్మలు, మరొకరోజు జామకాయలు, మరొకరోజు అరటిపండ్లు ఇలా అనేక ఫలాలను స్వామికి నివేదించేవారు. అటు తరువాత స్వామికి నీరాజనాలు అర్పించేవారు.

వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసుని కలియుగ ప్రారంభంలో చాలా సంవత్సరాలపాటు సాక్షాత్తూ దేవతలే అర్చించేవారు. అప్పటికి ఇంకా మానవులకు ఈ దివ్యప్రదేశం గురించి తెలియదు. దేవతలందరూ కొండపై ఆడుతూ, పాడుతూ తమకు కావలసిన ఫలాలను తింటూ అక్కడ ఉన్న అద్భుత సరస్సులలో స్నానమాచరిస్తూ పూతోటలలో రాత్రివేళ నిద్రిస్తూ ఎంతో ఆనందంగా గడిపేవారు. ఉదయాన్నే శ్రీ స్వామివారిని దర్శించి ఎన్నో స్తోత్రాలతో స్తుతించేవారు. శ్రీనివాసుడు వెలసిన ప్రదేశంలో పైన ఒక దివ్యవిమానం ఉంటుంది (గోపురం). ఆ దివ్య విమానం ఇప్పటికీ తిరుమలలో ఉంటుంది. కానీ సామాన్యమానవులెవరికీ ఆ దివ్య విమానం కనపడదు. కేవలం మానవ నిర్మితమైన గోపురం మాత్రమే కనిపిస్తుంది. ఎంతో తపోశ్శక్తివంతులకు మాత్రమే ఆ దివ్య విమానం దర్శనమిస్తుంది. ఆ విమానం కోటి సూర్యకాంతితో, కోటి సూర్య తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుంది. విమానం అంటే అద్భుతమైన ఆలయ గోపురం. ఇప్పుడు మనం చూస్తున్న మానవ నిర్మితమైన ఆలయ మొత్తాన్ని దాటి ఎంతో పెద్దదై, ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుంది. అందుకే భక్తులు తిరుమల ఆలయ పరిసరాల్లో అంతటి మధురానుభూతులకు లోనౌతారు. ఆ దివ్య విమానం నుంచి వస్తున్న తేజస్సు వేంకటాద్రి కొండపై మొత్తం ఆవరించి ఉంటుంది. అందుకే ఆ కొండపై కాలు పెట్టగానే మనలో ఏదో దివ్య శక్తి ప్రవేశించినట్లు అనుభూతి కలుగుతుంది. నిత్యం సాధన చేసేవారికైతే ఆ అనుభూతి ఇంకా అద్భుతంగా



ఉంటుంది.

సాక్షాత్తూ వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణులవారే శ్రీనివాసునిగా ఇక్కడ వెలసి, దివ్య విమానం పైన ఉండటంతో తిరుమల కొండలన్నీ ఎల్లప్పుడూ అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటాయి. ఇక ఆలయంలోనికి వెళ్ళి స్వామిని దర్శిస్తూ కలిగే దివ్యానుభూతి మాటలలో వర్ణించలేనిది. ఆ దివ్యమంగళ మనోహర రూపాన్ని దర్శించిన వెంటనే మనస్సు కోరికలన్నింటికీ అతీతమౌతుంది. ఏదో దివ్యమైన మాయ మనల్ని కప్పివేస్తుంది. ఆ స్వామి తేజస్సుకు మనం మంత్రముగ్ధులై ఏ కోరికలూ లేకుండా, ఏ కోరికలూ అడగకుండా బయటకు వస్తాం. ఆ స్వామిలో ఉన్న సమ్మోహన శక్తి అంతటిది!

వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరుడు ఆనంద స్వరూపుడు, సచ్చిదానంద మూర్తి. నిత్యానందమూర్తి అతడే. మనలోని అన్నమయ, ప్రాణమయ, విజ్ఞానమయ కోశముల నడుమ ఆనందమయ కోశములోనున్న ఆనందమూర్తి ఈ శ్రీమన్నారాయణుడే. ఈ జగత్తు యావత్తును ఆవరించి యున్న పరమేశ్వరుడు ఈ శ్రీనివాసుడే. ఈ పరబ్రహ్మ మూర్తి జగత్తు ఆరంభించకముందు పూర్ణుడే, ఆవిర్భవించిన తరువాత పూర్ణుడే, ఈ సృష్టి మొత్తం లయం అయిన తరువాత కూడా పూర్ణుడే.

ఆ విధంగా శ్రీమన్నారాయణులవారు వేంకటాద్రిపై వెలసిన మొదటిరోజులలో సాక్షాత్తూ దేవతలే స్వామిని సేవించేవారు. ప్రతిరోజు ఉదయమే స్వామివద్దకు వచ్చి అనేక సోత్రాలతో స్తుతించేవారు. కొంతమంది అద్భుత వాయిద్యాలు మ్రోగించేవారు. మరికొందరు కనులకు ఎంతో ఇంపుగా నృత్యం చేసేవారు. అప్పుడప్పుడు బ్రహ్మ, సరస్వతి, మహేశ్వరుడు, పార్వతీదేవి ఇంకా అనేకమంది దేవతలు కలిసి వేంకటాద్రికి వచ్చి ఇక వారంరోజులు కొండపైనే ఉండి వెళ్లేవారు. వీరు ఇలా వచ్చినప్పుడు ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్న దేవతలందరూ గొప్ప ఉత్సవాలు చేసేవారు. ఆ ఉత్సవాల అద్భుతదృశ్యం మానవమాత్రులమైన మనం ఊహించుకోవడానికే కష్టంగా ఉంటుంది. తిరుమల కొండలనిండి ఎక్కడ చూసినా దేవతాగణమే కనిపించేది... ఒక చోట బ్రహ్మ,

సరస్వతి, మరొకచోట పార్వతీ పరమేశ్వరులు... అటు పక్కగా ఇంద్రాది అష్టదిక్పాలకులు... ఇటుపక్క ఆదిత్యాది నవగ్రహ దేవతలు... అటు పక్కన గణపతి... మరొకచోట శ్రీ హనుమంతులవారు ... అదిగో అక్కడ శ్రీ వల్లీదేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరులవారు... ఇలా ఎందరో దేవతలు కనిపిస్తున్నారు. ఒక్కొక్కరు అద్భుతమైన వస్త్రాలను ధరించి ఉన్నారు. ఎంత మెరిసిపోతున్న వస్త్రాలు... ఎంతో ప్రకాశిస్తున్న ఆభరణాలు... వీరందరూ వేంకటాద్రిపై ఉన్న రకరకాల పుష్పాల తోటలలో అటు ఇటు కోలాహలంగా తిరుగుతుంటే ఎంతో చూడముచ్చటగా ఉంది. ఒకపక్కన కొంతమంది అద్భుతమైన సౌందర్యరాశులు నృత్యం చేస్తున్నారు... వీరి నృత్యం చూసిన చెట్లపైనుంచి నెమళ్ళు కొన్ని కిందకు దిగి నాట్యం ఆడుతున్నాయి. . కొందరు దేవతలు చక్కటి సన్నాయి వాయిస్తున్నారు. మరికొందరు స్త్రీలు వీణలు మీటుతున్నారు. పక్కన చెట్లపై గల అనేక పక్షులు ఈ సంగీతాన్ని వింటూ ఎంతో ఆనందంలో మునిగి తేలుతున్నాయి. ఏనుగులు తమ తొండాలను పైకెత్తి ఆనందంతో ఘీంకరిస్తున్నాయి.

శ్రీమన్నారాయణులవారు వేంకటాద్రిపై కొలువుండటం వలన కదా ఇంతమంది దేవతలు ఇక్కడ వచ్చారు అని అక్కడ చేరిన దేవతలందరూ అనుకుంటున్నారు. వీరందరికీ వసతి ఏర్పాట్లన్నీ మయుడు చూస్తున్నాడు. భోజన ఏర్పాట్లను కొందరు దేవతలు పర్యవేక్షిస్తున్నారు,.... ఇలా సర్వ దేవతాగణమూ వారం రోజులు వేంకటాద్రిపైననే ఉండి వెళ్ళారు. ఇలా రెండు, మూడు మాసాలకు ఒకసారి ముల్లోకాలలోని దేవతాగణమంతా తిరుమల చేరేవారు. ఆ వారంరోజులు తిరుమల కొండలన్నీ అద్భుతమైన శోభతో ప్రకాశించేవి. విశేషమేమిటంటే ఇప్పటికీ ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాల సమయంలో సర్వదేవతాగణమూ వేంకటాద్రిపైననే ఉంటుంది. అందుకే భక్తులందరికీ బ్రహ్మోత్సవాలలో పాల్గొనడమంటే అంత ఇష్టం. దేవతలందరూ కొండపై ఉండటంచేత బ్రహ్మోత్సవం జరుగుతున్న రోజులన్నీ తిరుమలకొండలు ఎంతో దివ్యమైన శోభతో ప్రకాశిస్తూ ఉంటాయి.

బ్రహ్మోత్సవాల సమయంలో ఇలా దేవతలందరూ తిరుమలపై ఉండటం



వలన కొండపై ఉండే భక్తులందరికీ ఏదో తెలియని, అనిర్వచనీయమైన ఆనందం కలుగుతంది. మనకు గల సమస్యలన్నీ మర్చిపోతాం. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. పూర్వకాలంలో బ్రహ్మోత్సవాలు ప్రతీనెలా జరిగేవి. ఎంతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలలో శ్రీనివాసుడు తన ప్రియసఖులైన శ్రీదేవి, భూదేవి సమేతుడై తిరుమల మాడవీధులలో విహరిస్తుంటే ఆ అద్భుతదృశ్యం ఎంతో మనోహరంగా ఉంటుంది. మాటలలో వర్ణించలేని ఆనందం మనకు కలుగుతుంది.

శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలసిన తరువాత చాలా సంవత్సరాలు దేవతలే స్వామిని సేవించారు. కలియుగంలో శ్రీనివాసుని ఒక యాదవ భక్తుడు ప్రప్రథమంగా దర్శించుకున్నాడు. కానీ తరువాత కొన్ని సంవత్సరాలపాటు స్వామి వారికి ఏ పూజాదికాలూ లేవు. కొంతకాలానికి నెమ్మదిగా ఆటవికులు అక్కడక్కడ కొండలపై సంచరిస్తూ ఉండేవారు. అప్పటికి కూడా తిరుమల కొండలు మానవులకు తెలియని దివ్యప్రదేశమే. వారు ఆకాశంలో కనపడే సూర్యచంద్రులనే దేవతలుగా భావించేవారు. ప్రకృతిలో లీనమై జీవించేవారు. ఆడుతూ పాడుతూ ప్రశాంత జీవనం సాగించేవారు. వారి ప్రపంచమంతా ఆ కొండలూ కోనల్లోనే ఉండేది. ఇలా ఉండగా కొన్నాళ్ళకు ఆటవికులు శేషాచల అడవుల ప్రాంతం కూడా చేరుకున్నారు. ఆ రోజుల్లో శేషాచల పర్వతశ్రేణులన్నీ ఎంతో దట్టమైన అడవులతో ఉండి ఉండేవి. సింహాలు, పులులు, చిరుత పులులు, వంటి క్రూరమృగాలు, ఎన్నో విష సర్పాలు సంచరిస్తూ ఉండేవి. శేషాచల పర్వతాలలో ఎన్నో అద్భుతమైన సెలయేర్లు ఉండేవి. ఆటవికులు ఆ సెలయేర్లలోని నీరు త్రాగేవారు. ఆ సెలయేర్ల దగ్గరికే క్రూరమృగాలు కూడా దప్పిక తీర్చుకొనడంకోసంరాత్రివేళల్లోవ చ్చేవి. అ వివ చ్చేవేళల్లోఆ టవికులువాటికి దూరంగా ఉండేవారు.

ఒకనాడు ఒక ఆటవిక యువకుడు ఒక కుందేలును చూసి వేటాడుతూ ముందుకు పరిగెత్తాడు. ఆశ్చర్యంగా ఆ కుందేలు ఎంతో వేగంగా దూకుతూ పక్కన పొదల్లోకి మాయమైంది. ఆ యువకుడు అక్కడకు వెళ్లి పొదలలోకి చూడగానే

వెంటనే దూరంగా మరో పొదలో కనిపించింది. అక్కడకు వెళ్లగానే విపరీతమైన వేగంగా దూకుతూ మరోపొదలోకి వెళ్లింది. చిన్న కుందేలు పిల్ల ఇంత త్వరగా మాయమవటం ఆ యువకుడికి ఎంతో ఆశ్చర్యంగా అనిపించింది. ఈ రోజు ఎలాగైనా దీనిని పట్టుకుని తీరాల్సిందేనని ఆ యువకుడు అనుకున్నాడు. అలా ఆ కుందేలును అనుసరిస్తూ అడవిలో చాలాదూరం వెళ్లాడు. ఎంత ప్రయత్నించినా ఆ కుందేలు దొరికినట్లే దొరికి మాయమౌతోంది. యువకుడిలో ఓపిక నశించింది. కానీ పట్టుదల ఇంకా ఎక్కువైంది. రోజూ ఎంతో తేలికగా వేటాడే ఈ కుందేలు ఈ రోజు తనను ఎందుకు ఇంతగా వేధిస్తోందని అనుకున్నాడు.

అలా దానివెనుక పరిగెడుతూ ఒకచోటకు వచ్చేటప్పటికి అక్కడ చెట్లన్నీ చాలా గుబురుగా ఉన్నాయి. ఆ కుందేలు వీటిలోనే ఎక్కడో దాక్కుని ఉంటుంది అని తలచి ఆ గుబుర్లను చీల్చుకుంటూ ముందుకు సాగాడు. అంతే! అక్కడ ఎదురుగా ఒక అద్భుత దృశ్యం కనిపించింది. అది చూసిన ఆ యువకునికి నోట మాట రాలేదు. ఎదురుగా ఒక పెద్ద చింతచెట్టు కనిపించింది. అది ఎంతో పెద్దదిగా, కొమ్మలు ఎంతో దూరం వ్యాపించి ఉన్నాయి. పక్కనే ఎన్నో సంపంగి వృక్షాలు కూడా ఉన్నాయి. ఆ చెట్ల మధ్యన, దట్టమైన గుబుర్ల మధ్యన అక్కడ ఒక అద్భుతమైన విగ్రహం కనపడింది. ఆ విగ్రహం ఎంతో మనోహరంగా ఉంది. ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆ దివ్య మనోహర మంగళ మూర్తిని చూడగానే ఆ యువకునికి ఎంతో శక్తి వచ్చినట్లయింది. అంతుకు ముందున్న అలసట అంతా పూర్తిగా తొలగిపోయింది. ఆ విగ్రహ సౌందర్యాన్నే చూస్తూ నోట మాట రాకుండా ఉండిపోయాడు.

కాసేపటికి తేరుకుని ఈ విశేషం గూడెంలోవారికి చెప్పాలని వెనుకకు తిరిగి అడవిలో పరిగెడుతూ గూడేనికి వచ్చాడు. గూడెంలోని వారందరితో తాను చూసిన అద్భుతాన్ని చెప్పాడు. వారెవరూ అతనిమాటలు నమ్మలేదు. ఎందుకంటే వారి చిన్న ప్రపంచంలో వారెప్పుడూ ఇటువంటిది వినలేదు, చూడలేదు, అప్పుడు గూడెం పెద్ద తాను కూడా వస్తానని తనకు ఆ దృశ్యం చూడాలని ఉందని అన్నాడు. అప్పుడాయువకుడు గూడెం పెద్దతో పాటు మరికొందరు యువకులు వెంటరాగా



అందరూ కలిసి ఆ విగ్రహం ఉన్న ప్రదేశానికి వచ్చారు.

అక్కడ చూసిన దృశ్యానికి వారికెవ్వరికీ నోట మాట రాలేదు. వీరందరూ ఇక్కడకు వచ్చేటప్పటికి ఆ విగ్రహం ఎదురుగా ఒక నెమలి అద్భుతంగా నాట్యం ఆడుతోంది. పక్కన ఉన్న చెట్లపై కోయిలలు ఎంతో శ్రావ్యంగా పాడుతున్నాయి. ఇంతలో ఎక్కడినుంచో రెండు పెద్ద పులులు తీవ్రంగా గాండ్రిస్తూ అక్కడికి వచ్చాయి. ఎటువంటి విల్లంబులు లేకుండా రావటంచేత ఆ పులులను చూచి వీరందరూ ఎంతో భయపడ్డారు. కానీ ఇంతలో ఒక ఆశ్చర్యం జరిగింది. అంత గాండ్రిస్తూ వచ్చిన ఆ రెండు పులులు ఒక్కసారిగా సాధు జంతువుల వలె నెమ్మది నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ ఆ విగ్రహం పాదాల పక్కగా వచ్చి కూర్చున్నాయి. ఏనుగులు తమ తొండాలతో నీటిని తెచ్చి శ్రీ స్వామివారిని అభిషేకిస్తున్నాయి. కొన్ని అందమైన పక్షులు శ్రీ స్వామివారి విగ్రహం ముందు చిత్ర,వి చిత్రవి న్యాసాలుచేస్తూఅ టూఇ టూఎ గురుతున్నాయి. ఇ ంతలోర ంగు రంగుల రామచిలుకలు తమ ముక్కులకు అద్భుతమైన ఫలాలను కరుచుకుని ఆ విగ్రహం పాదాలవద్ద పడవేశాయి. ఇదంతా చూస్తున్న గూడెం మనుషులను నోట మాట రాలేదు.

గూడెం పెద్ద ఒక్కసారిగా తల ఎత్తి ఆకాశంవైపు చూశాడు. వెంటనే ఏదో అర్థమైనట్లు సంతోషంగా ఎగిరి గంతులు వేశాడు. అతడిని చూసి ఇతరులందరూ కూడా ఎగిరి గెంతులు వేస్తూ నృత్యం వేయసాగారు. ఎంతో ఆశ్యర్యకరంగా ఆ విగ్రహం పక్కనే కూర్చున్న పులులు అటూ ఇటూ కదలకుండా కళ్ళార్పకుండా వీరిని చూడసాగాయి. అప్పుడూ గూడెం పెద్ద వారందరితో ఇలా అన్నాడు. ‘ఈ విగ్రహం మనను కాపాడటానికి వచ్చిన దేవత. మనం రోజూ ప్రార్థించే సూర్యచంద్రులే మనలను రక్షించడానికి ఈ దేవతను పంపారు. ఇప్పటినుంచి మనందరికీ ఈ స్వామియే కులదైవం. మనల్ని రక్షించే దైవం. ఇకనుంచి ప్రతిరోజూ మనం ఇక్కడకు వచ్చి స్వామిని కొలవాలి. అని అన్నాడు. అక్కడున్న కొందరు యువకులు ఈ విగ్రహాన్ని ఎత్తి మన గూడెంకు తీసుకుపోతేనో అన్నారు. అలా అనగానే అక్కడ ఉన్న రెండు పులులు గట్టిగా గాండ్రించాయి. అప్పుడు

గూడెం పెద్ద వారిని కసురుకున్నాడు. ఈ విగ్రహాన్ని కదిల్చే ప్రసక్తే లేదన్నాడు. స్వామి ఆకాశంనుండి ఇక్కడకు వచ్చాడు. మనం రోజూ ఇక్కడకే వద్దాం అన్నాడు. ఇప్పటినుంచి ఈ స్వామి మనలో ఒకడు. మన దేవుడు, మన నాయకుడు కూడా అన్నాడు. మనం ఈ స్వామిని జాగ్రత్తగా చూసుకోవాలి అని చెప్పాడు. రోజూ గూడెం నుంచి ఎవరో ఒకరు వచ్చి నైవేద్యం పెట్టాలి అన్నాడు. మనలందరిని రక్షించడానికి స్వామి వచ్చాడు కాబట్టి పెద్ద ఉత్సవం చెయ్యాలి అన్నాడు.

వెంటనే అందరూ గూడేనికి తిరిగి వెళ్లారు. గూడెంలో ఉన్నవారందరికీ తాము చూసిన విశేషం చెప్పారు. అందరూ తమని కాపాడటానికి దేవత వచ్చాడని ఎంతో సంతోషపడ్డారు. తమకు ఏ కష్టం వచ్చినా చెప్పుకోవడానికి తమకు ఓ దేవత దొరికాడని చెప్పాడు. ఆ నాటి విశేషాలన్నీ ఒకరితో ఒకరు చెప్పుకుని ఎంతో సంతోషించారు. ఆ మరునాడు చెయ్యబోయే ఉత్సవం గురించి అందరూ ఆలోచించారు. గూడెం పెద్ద ఎవరెవరు ఏం చేయాలో నిర్ణయించాడు. ఎవరు బయటకు వెళ్ళాలి? ఎవరు ఏ పండ్లు తీసుకురావాలి? ఎవరు ఏ పూలను తీసుకురావాలి? ఎవరు కల్లు తీసుకురావాలి? ఇలా అనేక విషయాలు గూడెం పెద్ద అందరికీ వివరంగా చెప్పాడు.

మరునాడు గూడెంలోని చిన్నా పెద్ద అందరూ కలిసి స్వామివద్దకు చేరుకున్నారు. మొదటిసారి స్వామి విగ్రహం చూసినవారంతా ఆ స్వామి మనోహర రూపాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అంతటి రమణీయమూర్తిని వారు కనులు పెద్దవి చేసుకుని ఎంతో ఆశ్చర్యపోతూ చూశారు. అంతటి అందమైన మూర్తిని వారెప్పుడూ చూడకపోవడంతో వారికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. స్వామివారి చుట్టుపక్కల ఉన్న చెదలనూ, పొదలనూ, నరికి ఆ ప్రదేశాన్ని చదును చేశారు. రాత్రి వేటాడిన జంతువులను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఇంకా ఎన్నో రకాల పండ్లను స్వామి ముందు పెట్టారు. నైవేద్యం అనేమాట వారికి తెలీదు. వారి మనస్సులో ఉన్న విషయం ఒక్కటే, ఇకనుంచి మన ఆలన, పాలన అంతా ఈ స్వామియే చూసుకుంటాడు. మనకోసమే ఈ స్వామి ఆకాశం నుంచి వచ్చాడన్న భావన వారిది. అందుకు



తాము తినే ప్రతి పదార్థాన్ని ముందు ఆ స్వామి ముందు ఉంచాలని తలచారు. ఇంతలో కొందరు కల్లు తెచ్చిపెట్టారు. కొందరు ఎంతో వైభవంగా స్వామిముందు నృత్యం చేశారు. అటుతరువాత వారు వేటాడిన జంతువుల మాంసం తిని కల్లు తాగి రాత్రంతా అక్కడే పడుకున్నారు. ఉదయం లేచి హుషారుగా గూడానికి చేరుకున్నారు.

అప్పటినుంచి స్వామి వారి జీవితంలో ఒక భాగం అయిపోయాడు. వాళ్ళకి ఏ కష్టం వచ్చినా ఆ స్వామితోనే చెప్పుకునేవారు. ఏ శుభం జరిగినా ఆ స్వామితో సంతోషంగా పంచుకునేవారు. గూడెంలో ఎవరికైనా పిల్లలు పుడితే ఆ పిల్లవాడిని ఎంతో కోలాహలంగా అందరూ కలిసి ఎత్తుకుని తీసుకుని వచ్చి స్వామి ముందు పడుకోపెట్టేవారు. వివాహం జరిగితే ఆ కొత్తజంట స్వామిచెంతకు వచ్చి పండ్లు సమర్పించేవారు. ఏ కష్టం, నష్టం వచ్చినా స్వామికి గట్టిగా అందరికీ వినిపించేలా చెప్పుకునేవారు. ఆ స్వామి వీరందరినీ చల్లగా చూసేవాడు. వీరి అమాయకపు భక్తికి ఎంతో ముచ్చటపడేవాడు.

ప్రతీ పౌర్ణమినాడు వీరందరూ ఎంతో బ్రహ్మాండమైన ఉత్సవం చేసేవారు. ఆ రోజు ఉదయాన్నే అందరూ రంగు రంగుల వస్త్రాలతో తలలో అనేక రకాల పక్షుల ఈకలను ధరించి స్వామి వద్దకు చేరుకునేవారు. స్త్రీలు స్వామిని రకరకాల పూలతో అలంకరించేవారు. వారికి ఈ పువ్వు, ఆ పువ్వు అని తేడా లేదు. అడవిలో తమకు లభించిన పువ్వులన్నింటిని తెచ్చి స్వామిని అలంకరించేవారు. అడవిచెట్ల తీగలతో పూలమాలలు కట్టేవారు. ఒకరితో ఒకరు పోటీపడి రంగు రంగుల పుష్పాలతో మాలలను కట్టేవారు. ఆ మాలలన్నీ స్వామి ముందు పెట్టేవారు. కొన్ని మెడలో వేసేవారు. చేతులు మీద పెట్టేవారు. కొన్ని మాలలు భుజాలమీద వేలాడదీసేవారు. ఇలా ఆ స్వామిని వీరందరూ రకరకాలుగా అలంకరించి మురిసిపోయేవారు. వీరు ఉత్సవం చేస్తూ నృత్యం ఆడుతుంటే అడవిలోనుంచి పులులు, సింహాలు, ఏనుగులు, ఎలుగుబంట్లు, కోతులు, లేళ్ళు, జింకలు, అడవిదున్నలు ఇలా అనేక రకాల జంతువులు కూడా అక్కడకు వచ్చేవి. కానీ అవేవీ వీళ్ళను ఏమీ చేసేవి కావు. అసలు అక్కడ మానవులు ఉన్నట్టే

ప్రవర్తించేవి కావు. వీరందరికీ ఈ విషయం ఎంతో ఆశ్చర్యకరంగా కనిపించేది. ఇంతటి క్రూర జంతువులు ఇలా సౌమ్యంగా ఎలా ఉండగలుగుతున్నాయి. కోతులు, పులులు, సింహాలమీద ఎక్కి దుంకుతున్నా అవి ఏమాత్రం వీటిని హింసించకపోవటం పైపెచ్చు ఆనందపడుతున్నట్టు కనిపించటం, గూడెంవారికి ఎంతో ఆశ్చర్యంగా అనిపించేది. ఇదంతా ఆ స్వామి గొప్పతనంగా తలచేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు ఆ గూడెం పెద్ద అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. అతడికి ఏదో విషసర్పం కుట్టింది. అంతే ఒక్కసారిగా ఒళ్ళంతా దద్దుర్లు, తిమ్మిర్లు మొదలయ్యాయి. బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. నోట మాట కూడా సరిగా రావటం లేదు. సాధారణంగా గూడెంలోవారికెవరికైనా ఏ పామో, పురుగో కుడితే తానే పసర్లు కొన్ని ఇచ్చి మూలికలతోవైద్యంచేస్తాడు. ఇప్పుడు తనకే ఈ విధంగా జరగడంతో ఎవరికీ ఏమీ పాలుపోవట్లేదు. గూడెంవారందరూ అతనిచుట్టూ చేరారు. వారికి తెలిసిన మూలికల పసర్లు తెచ్చి పోశారు. కానీ ఎటువంటి లాభం లేకపోయింది. నోటిమాట పూర్తిగా పడిపోయింది. ఇక అందరిలో ఆందోళన మొదలైంది. ఏం చేయాలో పాలు పోవటం లేదు. ఆ పెద్దాయన ఇంతలో ఏదో వాళ్ళకి చెప్పాలని తాపత్రయపడుతున్నాడు. కానీ అతడు ఏం చెప్పదలచుకున్నాడో ఎవరికీ అర్థం కావట్లేదు. ఆయన ఏం చెబుతున్నాడో, ఏం కావాలంటున్నాడో ఎవరికీ అర్థం కావట్లేదు. ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారు. ఆయన బాధ చూడలేకపోతున్నారు.

ఇలా వారి చుట్టూ గుమికూడినవారందరూ ఎంతో బాధపడుతున్నారు. వారిలో స్వామిని మొదటిసారి చూసిన యువకుడు కూడా ఉన్నాడు. ఆ పెద్దాయన మధ్య మధ్యలో ఈ యువకుడి వంకే చూస్తున్నాడు. ఒక్కసారిగా ఆ యువకుడి మనసులో ఏదో స్ఫురించింది. తక్షణమే ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ పెద్దాయన్ని తన భుజాలపై వేసుకుని ఉరుకు పరుగున బయలుదేరాడు. అక్కడ ఉన్నవారందరికీ ఆ కుర్రవాడు ఎందుకు అలా చేస్తున్నాడో అర్థం కావట్లేదు. ఎటు వెళ్తున్నాడో అర్థం కావట్లేదు. కానీ ఆ ముసలాయన కొంచెం స్థిమితపడ్డట్టు వీరికి



తోచింది. బహుశా ఆ పెద్దాయన మనసులో ఏముందో అందరికీ ఏం చెప్పాలనుకుంటున్నాడో ఈ కుర్రవాడికి అర్థం అయ్యిందేమోనని అనిపించింది. అందరూ అతని వెంటనే పెరిగెత్తారు. ఆ కుర్రవాడు ఆ పెద్దాయన్ను భుజాన వేసుకుని వడివడిగా నడుస్తూ సరాసరి స్వామి విగ్రహం ముందకు తెచ్చి స్వామి ఎదురుగా పడుకోబెట్టాడు. అప్పటికి ఆ పెద్దాయన నోటినుంచి నురుగ కూడా వస్తోంది. అందరిలోనూ ఎంతో ఆందోళన మొదలైంది. ఈ యువకుడు స్వామివైపు తిరిగి గట్టిగా మాట్లాడుతూ ఈ పెద్దాయన్ని రక్షించమని వేడుకున్నాడు.

వెంటనే ఒక అద్భుతం జరిగింది. ఆ స్వామి పాదాలవద్దనున్న పుష్పం గాలికి ఎగిరి ఈ పెద్దాయన శరీరం మీద పడింది. ఆ పుష్పం ఇలా తగలగానే వెంటనే ఆ పెద్దాయన నిద్రలోనుంచి లేచి నిల్చున్నట్లు ఒక్కసారిగా లేచి ఒళ్లు విదిలించుకుని నుంచున్నాడు. గూడెంవారందరూ ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఇక చనిపోతున్నాడన్న మనిషి ఒక్క క్షణంలో ఇలా లేచి నుంచోవటం వారికి ఎంతో ఆశ్చర్యకరంగా తోచింది. ఇదంతా ఆ స్వామి మహిమగా అర్థమైంది. వారి ఆనందానికి అంతులేదు. అప్పటినుంచి గూడెంవారందరికీ స్వామిపై నమ్మకం ఇంకా ఎక్కువైంది.

అలా చాలాకాలం శ్రీనివాసుని ఆటవికులే కొలిచేవారు. ఆ తరువాత కొన్ని సంవత్సరాలు ఆ ఆటవికులందరూ సామాన్యజనంలో కలిసిపోయినతరువాత కొన్ని సంవత్సరాలు ఆ స్వామికి ఏ పూజాదికాలు లేవు. అసలు కొండమీద ఆలయం ఉన్నట్లే ప్రజలకు తెలియదు. ఆ రోజుల్లో తిరుమలకొండలన్నీ దట్టమైన అడవులతో ఉండేవి. అనేక క్రూరమృగాలకు ఆలవాలమై ఉండేది. అప్పటికి తిరుపతి పట్టణమే లేదు. తిరుచానూరు మాత్రమే ఉండేది. కొండపైనున్న స్వామిగురించి తెలిసిన తరువాత అప్పుడప్పుడు కొందరు భక్తులు గుంపులు గుంపులుగా కొండనెక్కడం ప్రారంభించారు. కానీ కొండనెక్కడానికి సరైన దారిలేక ఎంతో కష్టపడవలసి వచ్చేది. సంవత్సరం పొడుగునా విపరీతమైన చలిగా ఉండేది. కొండనెక్కుతున్న యాత్రీకులను అడవిదోమలు, తేనెటీగలు కుట్టి బాధించేవి. ఒక్కొక్కసారి వారిదారిలో పులులు, ఎలుగుబంట్లు వస్తుండేవి. కొండనెక్కి

స్వామిని దర్శించటం ఎంతో దుర్లభంగా ఉండేది. కొన్ని సంవత్సరాలపాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు కూడా కేవలం మొదటిరోజు కొండమీద నిర్వహించి తరువాత రోజులన్నీ తిరుచానూరులోనే నిర్వహించేవారు.

అసలు ఆ రోజులలో చాలామంది భక్తులు తిరుచానూరులోనే శ్రీనివాసుని దర్శించుకుని తిరిగి వెళ్లిపోయవారు. తిరుచానూరులో ఆ రోజులలో స్వామివారి ఉత్సవమూర్తితో ఉన్న ఆలయం ఉండేది. భక్తులందరూ ఇక్కడే స్వామిని దర్శించి కళ్యాని నది ఒడ్డున తలనీలాలు సమర్పించేవారు. కల్యాణి నది తీరం కాబట్టి కల్యాణకట్టగా పేరొంది నేడు తిరుమలలో కూడా తలనీలాలు సమర్పించే ప్రదేశాన్ని కల్యాణకట్టగా పిలుస్తున్నారు. ఆ రోజులలో కొండపై స్వామి ఆలయానికి సంబంధించిన విషయాలు చూడటానికి తిరుచానూరులో పన్నెండుమంది స్థానత్తారులు ఉండేవారు. వీరిలో తిరుచానూరులో గల వైష్ణవసభనుండి కూడా ప్రతినిధులు ఉండేవారు. తిరుమల ఆలయం పల్లవ, చోళుల, చంద్రగిరి రాజుల ఏలుబడిలో ఎంతో వైభవంగా వెలిగింది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా వారి కంపెనీ యాజమాన్యంలో వచ్చినప్పటికీ వారెప్పుడూ తిరుమల ఆలయ విషయాలలో జోక్యం చేసుకోలేదు. అంతేకాదు, మహమ్మదీయులు భారతదేశమంతా తిరిగి ఎన్నో ఆలయాలపై దండెత్తి అపారసంపదను దోచుకున్నప్పటికీ తిరుమల ఆలయం జోలికి మాత్రం రాలేదు. ఇది ఆ శ్రీనివాసుని మహిమ తప్ప మరొకటి కాదు.

వేంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుడు, సాక్షాత్తూ ప్రణవస్వరూపుడైన శ్రీమన్నారాయణుడే. ఓంకారము మహా మహిమాన్వితమైనది. దేనియందు కాలత్రయము, దేవతాత్రయము, లోకత్రయము, వేదత్రయము స్థితములై వున్నవో అట్టి మహాజ్యోతి స్వరూపమే ఓంకారము. ఎవరైతే వేంకటాద్రిపై ఓంకారాన్ని ధ్యానం చేస్తారో వారికి సహస్ర అశ్వమేధయాగాలకంటే కూడా ఎక్కువ ఫలం లభిస్తుంది. ఆ శ్రీమన్నారాయణుని స్వరూపమైన ఓంకారము, ఒక్క సారి ఉచ్ఛరించిన మాత్రమే సర్వరోగాలు నశించి, సర్వ ఐశ్వర్యాలు లభించగలవు. వేంకటాద్రి వేంకటేశ్వరుడే ఓంకార స్వరూపుడు.

శ్రీ వేంకటేశ్వరుడు పురుషోత్తముడు, అతడు సర్వ స్వతంత్రుడు, అతని



వలననే సృష్టి, స్థితి, లయములు, నియమ నియంత్రణలు, జ్ఞానము, విముక్తి, ఆనందము, మానవులకు లభించును. అజ్ఞానులకు జ్ఞానమును, జ్ఞానులకు విముక్తిని, విముక్తులకు శాశ్వత ఆనందమును ప్రసాదించేది ఆ పురుషోత్తముడొక్కడే.

శ్రీమన్నారాయణుని రూపము అప్రాకృతము. జ్ఞానానంద పూర్ణమైన ఆ దివ్యమంగళ రూపము అనంతము. వేంకటాద్రిపై వేంకటేశ్వరుడు, ఆనంద నిలయంలో ఉన్నట్లు కనిపిస్తున్నా నిజానికి, వేంకటాద్రి మొత్తము, ఈ జగత్తు మొత్తము, తానే వ్యాపించి యున్నాడు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

మూడవ అధ్యాయం

## పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా ...

పూర్వకాలంలో తిరుపతి పట్టణంలో గోవిందాచారి అనే వైష్ణవపండితుడు ఉండేవాడు. అ తడువేదవేదాంగాలన్నీక్షుణ్ణంగాచ దివినవాడైఎ ంతోపాండిత్యం కలవాడై ఉండేవాడు. అన్ని శాస్త్రాలలోనే ఎంతో ప్రావీణ్యం కలిగి ఉండేవాడు. రోజూ ఇంటిలో నిత్యానుష్ఠానం ఉండేది. దేవతార్చన చేయనిదే గడప దాటేవాడు కాదు. జీవితం ఎంతో నియమ నిష్టలతో గడిపేవాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండేవారు. ప్రతీ శనివారం ఉదయం మూడు గంటలకే లేచి దేవతార్చన అయిన తరువాత భార్యా, కుమారులను తీసుకుని అయిదు గంటలకల్లా ఇంట్లో బయలుదేరి తిరుమల కొండ ఎక్కి స్వామిని దర్శించుకుని తిరిగి నాలుగు గంటల సమయంలో బయలుదేరి రాత్రిని ఇల్లు చేరుకునేవారు. ఆ రోజుల్లో కొండ ఎక్కటం చాలా కష్టంగా ఉండేది. విపరీతమైన చలిగా ఉండి సరైన దారి ఉండేది కాదు. కాళ్ళకు ముళ్ళు గుచ్చుకుంటూ మొనతేలిన రాళ్లు గుచ్చుకుంటూ కొండ ఎక్కటం ఎంతో కష్టంగా ఉండేది.



అయినా గోవిందాచారి కుటుంబం ఆ దారిలోనే ఎండావానలకు లెక్క చేయకుండా ప్రతీశనివారం ఆ స్వామిని దర్శించుకుని వచ్చేవారు. పిల్లలిద్దరూ ఎంతో ముచ్చటగా ఉండేవారు. ఇద్దరు పిల్లలను దంపతులిద్దరూ చంకలో ఎత్తుకుని వడివడిగా కొండనెక్కేవారు. ఎక్కుతున్నప్పుడు మధ్య మధ్యలో చెట్లకొమ్మలు మీదకు వచ్చి వాలేవి. దూరం నుంచి చూస్తే చిమ్మ చీకటిగా ఉండేది. దారిలో కొన్ని చోట్ల ఇరువైపులా ఉన్న చెట్లతీగలు పెనవేసుకుని ఉండేవి. ఒక్కోసారి ఆ పైనున్న చెట్లకొమ్మలపై భయంకరమైన పాములు పాకుతూ, వ్రేలాడుతూ కనిపించేవి. ఒక్కోసారి ఏ చిరుతపులో, పెద్దపులో ఒక్కసారిగా గాండ్రిస్తూ దారికి అడ్డంగా అడవిలో ఇటువైపునుంచి అటువైపు దూకుతూ వెళ్ళేవి. భక్తులు ఒక్కసారిగా గోవిందా అని ఎలుగెత్తి అరిచేవారు. ఆ స్వామి నామస్మరణచేస్తూ ముందుకు సాగేవారు. అన్నింటికి ఆ స్వామి తమకు అండ అని ధృఢమైన నమ్మకంతో ఉండేవారు. శ్రీనివాసుడు కరుణాసముద్రుడు. నమ్మినవారికి కొండంత అండ. మనం చేయవలసిందల్లా ఏ సంశయమూ లేకుండా స్వామిపై నమ్మకం ఉంచటమే. ఆ స్వామి క్షణంలో వచ్చి మనల్ని ఆదుకుంటాడు.

అటువంటి భయంకర పరిస్థితులలో కొండనెక్కే భక్తులందరూ కొండపైనున్న దేవుడు తమను ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాడని, తమకు ఏ అనారోగ్యం, ఏ ఆపదా రాకుండా కాపాడుతాడని, కంటికి రెప్పలా చూసుకుంటాడనే ధైర్యంతో ముందుకు సాగుతారు. ఆ స్వామిపై భక్తుల విశ్వాసం అంతటి అపారమైనది.

మానవులందరూ ఎల్లప్పుడూ సుఖాల కోసం అనేక కర్మలు చేస్తూ, మృత్యువుకు కారణమైనదీ, దుఃఖాన్ని కలిగించేది అయిన ధనార్జనపై విపరీతమైన వ్యామోహం పెంచుకుని ఇల్లు, పిల్లలు, సంసారం అనే ఊబిలో చిక్కుకుపోతారు. తాము చేసిన పుణ్య, పాపకర్మల ఫలితాన్ని అనుభవిస్తూ ఇతరులమీద అసూయ, ద్వేషాలు పెంచుకుంటారు. వీరందరూ విష్ణుమాయలో పడి కొట్టుకుపోతుంటారు. సర్వత్రా ఆత్మరూపంలో శ్రీమన్నారాయణుడే ఉన్నాడని గ్రహించేవారు, ఎటువంటి

ప్రాపంచిక వాసనలు అంటకుండా కర్మలను అనుభవిస్తూ సర్వకాల సర్వావస్థలయందు శ్రీమన్నారాయణునే స్మరించేవారు ఈ మాయని అధిగమించి అంత్యమున విష్ణుసాయుజ్యము పొందగలరు.

గోవిందాచారి ఎప్పుడూ శ్రీ స్వామివారి నామస్మరణలోనే ఉండేవాడు. అన్నింటికీ ఆ స్వామిదే భారం అని తలచేవాడు. అతడి కుటుంబం ఏమాత్రం భయపడకుండా ఆ స్వామినే ప్రార్థిస్తూ ప్రతీశనివారం కొన్నిసంవత్సరాల పాటు కొండమీదున్న స్వామిని దర్శించి కిందకు దిగేవారు. చాలామందికిది ఎంతో ఆశ్చర్యంగా ఉండేది. ప్రతీవారం కొండ ఎక్కి దిగటం అంటే సామాన్యమా? ఎంత శక్తి కావాలి? ఎంత ధైర్యం కావాలి? అదీ కీకారణ్యం గుండా, విపరీతమైన చలిలో ఒక పక్క అడవి దోమలు కుడుతూ ఉంటే, తేనెటీగల సమూహాలు అడ్డు వస్తూ ఉంటే, క్రూరమృగాలు అటూ ఇటూ దూకుతూ ఉంటే, చుట్టుపక్కల అడవిలోనుంచి భయంకరమైన మృగాల అరుపులు వినపడుతూ ఉంటే ఇలా ప్రతీవారం కొండ ఎక్కి దిగటం సామాన్య విషయం కాదు.

అయినా గోవిందాచారి ఇవేమీ లెక్క చేయకుండా స్వామిపై అఖండమైన భక్తితో ప్రతీ శనివారం కొండ ఎక్కి స్వామిని దర్శించుకునేవాడు. ఒకనాడు అలాగే ఉదయాన్నే బయలుదేరి కుటుంబం అంతా కొండ ఎక్కారు. ఆ రోజు చలి విపరీతంగా ఉంది. కుండపోతగా వర్షం పడుతోంది. అయినా ఇవేమీ లెక్కచేయకుండా కొండ ఎక్కి స్వామిని దర్శించి కిందకు దిగటం ప్రారంభించారు. వర్షం ఇంకా ఎక్కువైంది. పైన ఆకాశమంతా నల్లటి మేఘాలతో ఉండటం వలన వెలుతురు తగ్గింది. దారి కూడా సరిగా కనపడటం లేదు. ముందు అడుగు ఎటు వేస్తున్నామో తెలియటం లేదు. కొండవాలునుంచి కారుతున్న వర్షపు నీటికి కాలుకింద రాళ్ళు జారిపోతున్నాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కింద పడేలాగా ఉన్నాయి. గోవిందాచారి భార్య, పిల్లలతో వడివడిగా దిగసాగారు. అప్పటికి పెద్దపిల్లవాడికి ఏడు సంవత్సరాలు, చిన్నపిల్లవాడికి అయిదు సంవత్సరాలు. ఆ పిల్లలిద్దరూ కూడా తల్లితండ్రుల చేతులు పట్టుకుని త్వరత్వరగా వేగంగా దిగసాగారు.



చీకటి ఇంకా ఎక్కువైంది. ఓ చోటకు వచ్చేసరికి పైన ఉన్న చెట్ల కొమ్మలు ఎంతో దట్టంగా ఉండి దారి సరిగా కనిపించటం లేదు. ఒక్కసారిగా పెద్ద పిల్లవాడు కెవ్వున కేకవేశాడు. ఏమిటా అని చూస్తే ఒక భయంకర సర్పం ఆ పిల్లవాడి కాలుపై కాటు వేసి జర జరా పాకుతూ పక్కన ఉన్న పొదల్లోకి వెళ్ళిపోయింది. గోవిందాచారివెంటనేతనఅంగవస్త్రాన్నికొద్దిగాచింపివిషం పైకి పాకకుండా కాలుపై కట్టు కట్టాడు. పాము విషాన్ని నోటితో తీసి ఉమ్మేశాడు. కానీ అది భయంకర విష సర్పం కావడంతో అప్పటికే ఒంట్లోకి విషం ఎక్కినట్టుంది. పిల్లవాడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గోవిందాచారి పిల్లవాడిని భుజాన వేసుకుని వడివడిగా కొండ దిగి వైద్యుని దగ్గరికి వెళ్లాడు. వైద్యుడు వెంటనే కొన్ని పసర్లు తీసి తాను చేయగలిగింది చేశానని, కానీ ఇక ఏ సంగతీ చెప్పలేనని అన్నాడు. దురదృష్టవశాత్తు బాలుడు గంటలోనే మరణించాడు. ఆ తల్లిదండ్రులు ఎంతో కృంగిపోయారు.

అయినా గోవిందాచారి స్వామిపై భక్తిని విడువలేదు. కుమారుడు చిన్న వయస్సులోనే మరణించటం ప్రారబ్ధం తప్ప మరొకటి కాదని తలచాడు. కొన్నాళ్ళకు తిరిగి ప్రతీ శనివారం భార్య, చిన్నపిల్లవాడిని తీసుకుని కొండనెక్కి స్వామిని దర్శించేవాడు. ఆ కుటుంబానికి స్వామిపై గల అచంచల భక్తి అందరికీ ఎంతో ఆశ్చర్యమేసేది. శరీరం కొంత నలతగా ఉన్నా ఏ మాత్రం వెనుకాడక, ప్రతీవారం కొండనెక్కి స్వామిని దర్శించేవారు. ఇంతటి భక్తి ఉండేవారు ఎక్కడా ఉండరని తలచేవారు.

కొన్ని రోజులకు గోవిందాచారి భార్య సుమతికి ఏదో తెలియని అనారోగ్యం కలిగింది. రోజు రోజుకి శక్తి కోల్పోసాగింది. చాలా నీరస పడింది. ఇక కొండ ఎక్కే ఓపిక లేకపోయింది. ఆమెను ఇంటివద్దే వదిలి గోవిందాచార్యులు ప్రతీ శనివారం తన కుమారుణ్ణి తీసుకుని వేంకటాద్రి ఎక్కి స్వామిని దర్శించుకుని వచ్చేవాడు. ఆమె భర్తను ఏమాత్రం ఇబ్బంది పెట్టేది కాదు. పైగా మానవ జీవితం అతి స్వల్పమైనదని, తనగురించి ఆలోచించవద్దని, అన్నింటికన్నా ముఖ్యమైనది ఆ శ్రీనివాసుని సేవించడమేనని చెప్పి ఎంతో ప్రోత్సహించేది. ఆమె

భక్తి చూసి బంధువులందరూ ఆశ్చర్యపోయేవారు. గోవిందాచార్యులు ప్రతీ శనివారం కొండనెక్కి స్వామిని దర్శించుకునేవారు. ఆ శ్రీనివాసుని ఆకర్షణశక్తి అంతటిది! అంత అమోఘమైనది. ఆ స్వామిని ఒక్కసారి దర్శిస్తే మరలా మరలా దర్శించాలనిపిస్తుంది. ఒక్క క్షణమాత్ర దర్శనంతోనే మన కష్టాలన్నీ మరిచిపోతాం. మళ్ళీ ఎప్పుడు వస్తామా అని వేయి కనులతో ఎదురుచూస్తాము. ఈ సృష్టిలో ఉన్న అందమంతా ఆ శ్రీనివాసునిదే! ఈ కొండపై ప్రతీ చెట్టు, పుట్ట, ఎంతో అందంగా కనిపిస్తాయి. సృష్టిలోని ప్రకృతిలోని అందమంతా ఈ శేషాచల పర్వతశ్రేణిలోనే ఉంటుంది. అంతేకాదు, ఈ కొండలలో ప్రపంచంలో ఎక్కడా కనపడని అద్భుతమైన పూలమొక్కలు ఉంటాయి. మనకు ఎంతో పుణ్యఫలం ఉంటే మాత్రమే అటువంటి దివ్యపుష్పాలను దర్శించగలుగుతాము. మనకు తెలియని ఎన్నో దేవతా పుష్పాలు ఈ కొండపై ఉంటాయి. ఎన్నో రంగు రంగుల, అద్భుతమైన సువాసనలు విరాజల్లే ఈ పుష్పాలను చూస్తే మనస్సుకి ఎంతో ఆహ్లాదం కలుగుతుంది.

గోవిందాచారి అలా ప్రతీ శనివారం ఈ అద్భుతమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ కొండనెక్కి వచ్చేవాడు. కొంతకాలానికి అతని భార్య సుమతి ఒకనాడు తీవ్ర అనారోగ్యానికి లోనై మరణించింది. అప్పుడు బంధువులందరూ ఇక ప్రతీవారం వెళ్లడం మానమని పిల్లవాడి సంగతి చూడమని అన్నారు. అయినా గోవిందాచారి తన పట్టు విడువలేదు. భార్య చనిపోయి సంవత్సరం కాగానే తిరిగి కొండ ఎక్కటం మొదలుపెట్టాడు. ఒకనాడు అతడి కుమారుడికి తీవ్రమైన జ్వరం వచ్చి ఇంటివద్దనే ఉండిపోయాడు. గోవిందాచారి ఒంటరిగా కొండ ఎక్కటం ప్రారంభించాడు. రోజూ వెళ్ళే దారైనా అతడికి ప్రకృతి ఇంకా రమణీయంగా కనపడింది. మధ్య మధ్యలో ఒకరిద్దరు భక్తులు తనను దాటి ముందుకు వెళ్ళారు. తాను మాత్రం నెమ్మదిగా నడుస్తున్నాడు. మధ్య మధ్యలో పాదాలకు గుచ్చుకున్న ముళ్ళు తీస్తూ నడవసాగాడు. ఇంతలో సన్నటి వర్షం ప్రారంభమైంది. అయినా ఏమాత్రం తొణకకక ముందుకు నడుస్తున్నాడు.

ఇంతలో ఒక అద్భుతం జరిగింది. ఇన్ని సంవత్సరాలుగా ఆ స్వామిని



సేవించిన పుణ్యఫలంగా ఆ శ్రీనివాసుడు గోవిందాచారి కనులకు ఎదురుగా చతుర్భుజుడై శంఖచక్రాలతో ప్రత్యక్షమయ్యాడు. స్వామిని చూసిన గోవించారి నోటమాట రాలేదు. అప్పుడు శ్రీనివాసుడు ఆచార్య పురుషా! నీ అచంచల భక్తికి నాకెంతో సంతోషం కలిగింది. ఏదైనా కోరిక కోరుకో అన్నాడు. అప్పుడు గోవించారి స్వామితో స్వామీ! నిన్ను దర్శించిన నాకు ఇంక ఏ కోరికా లేదు. నాకు ఇక జన్మ లేకుండా మోక్షం ప్రసాదింపమని అన్నాడు. అప్పుడు శ్రీనివాసుడు గోవిందాచార్యులతో నీకు వెంటనే మోక్షం ప్రసాదించటం సాధ్యం కాదు, ఈ జన్మలో ఎంతో పుణ్యాత్ముడవైనప్పటికి గడచిన వేల జన్మలలో చేసిన కర్మల ఫలితంగా ఇప్పుడే మోక్షం రాదు. ఇంకా ఇరవై నాలుగు జన్మలు ఎత్తిన తరువాత నీకు మోక్షం కలుగుతుంది. అయితే ఈ ఇరవై నాలుగు జన్మలలోనూ నీవు క్రిమి, పక్షి, జంతు రూపాలలో ఈ కొండపైననే ఉంటూ నిత్యం నన్ను దర్శించుకుంటావు. ఇరవై నాలుగవ జన్మతో నీ ప్రారబ్ధకర్మ పూర్తయి నీవు నాలో ఐక్యమవుతావు అని చెప్పి అంతర్ధానమయ్యాడు. గోవిందాచారి ఆనందానికి అంతు లేదు. స్వామి తనను కరుణించినందుకు ఎంతో సంతోషపడ్డాడు. అటు తరువాత ప్రతివారం ఆ స్వామినే సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించాడు.

శ్రీ స్వామివారు అనుగ్రహించినట్లుగానే గోవిందాచార్యులు తరువాతి జన్మలో ఒక రామచిలుకగా వేంకటాద్రిపై జన్మించాడు. రోజూ గర్భగుడిలోకి వెళ్లి స్వామిని దర్శించి బయటకు వచ్చేవాడు. అక్కడ ఉన్న ఆచార్యపురుషులు ఇలా ప్రతీరోజు ఈ రామచిలుక ఆలయంలోకి రావడం చూసి ఆశ్చర్యపోయేవారు. అప్పటికి ఆలయం ఇంత పెద్దదిగా లేదు. ఒక్క మండపం మాత్రమే ఉండేది. ప్రతీరోజు ఈ చిలుక రావడం చూసి ఎవరో స్వామివారి పరమభక్తుడై ఉంటారని అనుకున్నారు. అలా గోవిందాచార్యులు తరువాత ఇరవై మూడు జన్మలలో కూడా రకరకాల పక్షుల రూపాలలో వేంకటాద్రిపై జన్మించి ఆ కొండలలో విహరిస్తూ నిత్యం శ్రీ స్వామివారిని దర్శిస్తూ చివరకు ఆ పరబ్రహ్మమూర్తిలో ఐక్యమయ్యాడు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

నాల్గవ అధ్యాయం

## వేదంబెవ్వని వెదికెడినీ ...

వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసుడు ఈనాటి కాలంనాటివాడు కాదు. కలియుగ ప్రారంభం నుంచి ఉన్నవాడు. ఎంతో అద్భుతమైన ప్రకృతి సంపదతో అలరారే శేషాచల పర్వత శ్రేణులలో వేంకటాద్రిపై కొలువు తీరిన శ్రీనివాసుడు కలియుగంలో మనలందరినీ రక్షించే అమృతమూర్తి. ఆ స్వామిని ఒక్కసారి తలిస్తే చాలు, కొన్ని లక్షల జన్మలలో చేసిన పాపాలు తొలగిపోతాయి. జీవితంలో కేవలం ఒక్కసారి దర్శించినా చాలు, కోట్ల జన్మలలో చేసిన పాపాలు క్షణంలో నశిస్తాయి. ఆ స్వామికి ధనికులు, పేదలు, పండితులు, పామరులు అనే బేధం లేదు. అంతెందుకు ఆ స్వామిని మానవులే కాదు, ఎన్నో పశు పక్ష్య మృగాలు సైతం సేవించి తమ జన్మ సార్థకం చేసుకున్నాయి. ఇప్పటికీ చేసుకుంటున్నాయి.

తిరుమల కొండలపై ఉన్న ప్రతి పక్షి, ప్రతీ జంతువు పూర్వజన్మలో స్వామి భక్తులే. ఆ స్వామిని విడిచి ఉండలేక మరుజన్మలలో ఈ వేంకటాద్రిపై క్రిమి కీటకాల రూపంలోనో, రకరకాల పక్షుల రూపంలోనో, అడవి మృగాల



రూపంలోనో జన్మించి ఆ స్వామికి అతి చేరువలో తమ జీవితం గడుపుతాయి. మనకు తిరుమల కొండలగురించి కానీ, ఆ శ్రీనివాసుని గురించి కానీ తెలిసిన విషయాలు అతి స్వల్పం. ఎన్నో లక్షల సంవత్సరాలు తపస్సు ఆచరించిన మహర్షులు సైతం స్వామివారిని, స్వామి దివ్యతత్వాన్ని అర్థం చేసుకోలేకపోయారు. ఇక అతి సామాన్యులమైన మనమెంత?

మానవులకు శ్రీనివాసుని ఉనికి తెలియన రోజులలో దేవతలు స్వామిని నిత్యం సేవించేవారు. ఆ రోజులలో ఆ కొండపై ఉన్న ఎన్నో రకాల క్రూరమృగాలు సైతం స్వామివారిని నిత్యం సేవించేవి. ఆ రోజులలో తిరుమల అడవులలో అతి భయంకరమైన సర్పాలు ఉండేవి. అవి కూడా అప్పుడప్పుడు ఆ స్వామి చెంతకు వచ్చి పడగ విప్పి ఆడేవి. ఆ కొండలరాయుడు అంటే ప్రతి జీవికి అంతటి ఆకర్షణ. ఒక్కొక్కసారి ఉదయాన్నే సింహాల గుంపు విగ్రహం ముందుకు వచ్చేవి. అప్పుడే పులులు కూడా వచ్చేవి. ఒక్కోసారి ఆ సమయానికి నాలుగైదు ఎలుగుబంట్లు వచ్చేవి. ఆ పులులు సింహాల్ని చూసి ఏమాత్రం బెదిరేవి కావు.

ఇంతలో ఒక కోతుల గుంపు కిచకిచలాడుతూ వచ్చింది. స్వామివారి విగ్రహం ఉన్న పక్కనే ఉన్న చెట్లపై అటు ఇటు దూకుతూ వచ్చాయి. వీటిని చూసి సింహాలు, సింహపు పిల్లలు ముచ్చటగా చెట్లపైకి చూసేవి. ఒక కోతిపిల్ల పట్టు జారి దబుక్కున కింద ఉన్న పులిమీద పడింది. అయితే పులి ఏమాత్రం తొణకకుండా కోతిపిల్లను ఏమీ చేయకుండా ఆప్యాయంగా నాలికతో దానివీపుమీద నాకింది. చెట్టుపై ఉన్న కోతిపిల్ల తల్లికి ఇది చూసి ముచ్చట వేసింది. చెట్టుపైనుంచి కిందకు దూకి ఆ పిల్లను నోటికి కరుచుకుని చెట్టుమీదకు దూకింది. ఇంతలో అక్కడికి పెద్ద పెద్ద భల్లూకాలు నాలుగు వచ్చాయి. ఏమాత్రం శబ్దం చేయకుండా స్వామివారి విగ్రహానికి ఎదురుగా కొంచెం దూరంలో నిల్చున్నాయి. ఇదంతా చూస్తుంటే ఆ స్వామికి ఎంతో ముచ్చట వేసింది. ఈ జీవులన్నీ ఆ స్వామి సృష్టిలోనివే కదా! స్వామివారి దివ్య విగ్రహాన్ని చూస్తూ ముచ్చట పడుతున్న ఈ జంతువులను చూసి స్వామికెంతో ఆనందం కలిగింది. అవన్నీ ఒకదానితో మరొకటి ఆడుకోవడం స్వామి చిరునవ్వుతో చూస్తున్నాడు.

ఈ హడావిడి చూసి ఎక్కడ నుంచో పెద్ద పెద్ద కొండచిలువలు వచ్చాయి.

పెద్ద నాగుపాములు వచ్చాయి. వాటిపక్కనే ముచ్చటగా పక్కన ఉన్న పొదలనుంచి ఎగురుతూ కుందేళ్ళు వచ్చాయి. ఇటుపక్కనుంచి చెంగు చెంగున దూకుతూ లేడిపిల్లలు వచ్చాయి. ఇంతలో చెట్లపైనుంచి కిందకు నాలుగు నెమళ్ళు వాలి స్వామివారి ఎదుట నృత్యం చేయసాగాయి. ఆకాశంలో చిరుజల్లు ప్రారంభమైంది. అయినా ఈ జంతువులన్నీ ఏమాత్రం చెదరక ఆనందంగా అక్కడే అటు ఇటు తిరుగుతున్నాయి. ఇంతలో ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది. ఆ మెరుపు చాటున ఉన్న దేవతలు కొందరు క్రింద తిరుమలపై ఈ అద్భుతదృశ్యాన్ని చూస్తున్నారు. ఇన్ని జంతువులు ఏదో ఒక సభలాగా శ్రీనివాసుని ఎదురుగా చేరడం చూసి వారికి ఆశ్చర్యం కలిగింది. వారందరూ ఒక్కసారిగా ఆకాశం నుంచి పూలవాన కురిపించారు. సన్నటి నీటి జల్లులు... మధ్య మధ్యలో రకరకాల పుష్పాలు శ్రీనివాసునిపైన, అక్కడ ఉన్న జంతు సమూహంపైన పడుతున్నాయి. మల్లెలు, చేమంతులు, కనకాంబరాలు, జాజులు, సంపెంగలు, గులాబీలు, గన్నేరులు, మందారాలు, కలువలు... ఇంతేకాక మనకు తెలియని ఎన్నో దేవలోకపు పుష్పాలు ఆకాశం నుంచి అలా జారుతూ ఆ స్వామిపై, పక్కన ఉన్న ఆ మృగాలపై పడుతుంటే ఆ దృశ్యం వర్ణించనలవి కానంత అద్భుతంగా ఉంది.

ఆ పరబ్రహ్మమూర్తి శ్రీనివాసుడు ఇవన్నీ చూస్తూ చిరునవ్వులో వెలుగుతున్నాడు. ఆకాశం నుంచి సన్నటి నీటి తుంపరులు రంగు రంగుల అద్భుత సువాసనలతో కురుస్తున్న పుష్ప వృష్టి ఎంతో అద్భుతంగా ఉంది. అవి శ్రీనివాసుని శరీరంపై పడగానే మరింతగా మెరుస్తున్నాయి. ఆ అద్భుతాన్ని ఆస్వాదిస్తూ ఆ మృగాలన్నీ కొన్ని గంటలపాటు తమను తాము మరిచిపోయాయి. అటు తరువాత నెమ్మదిగా అక్కటినుంచి కదిలి అడవిలోనికి వెళ్లిపోయాయి. ఈ దృశ్యం ఆ రోజులలో కొండపై సర్వసాధారణం. అప్పటికి ఇంకా మానవులకు శ్రీనివాసుని ఆవిర్భావ విషయం తెలియదు. తరువాత కాలంలో నెమ్మది నెమ్మదిగా భక్తులు రావటం ప్రారంభమైన తరువాత కూడా ఈ క్రూరజంతువులు భక్తులమధ్యలో తిరుగుతూ వారిని ఏమాత్రం హింసించేవి కావు. శ్రీనివాసుని చెంత అందరూ క్షేమమే కదా! అందరూ నిశ్చింతగా ఉండవచ్చు కదా!



ఆ రోజులలో కొండపై విపరీతమైన చలిగా ఉండేది. ఎప్పుడూ వాన కురుస్తూ ఉండేది. రాత్రిళ్ళు కొండలన్నీ క్రూరమృగాల అరుపులతో ప్రతిధ్వనించేవి. ఒకరోజు మామూలుగానే ఉదయాన్నే కొన్ని జంతువులు స్వామి విగ్రహం వద్దకు వచ్చాయి. వాటిలో ఒక పులి స్వామి చుట్టూ నూట ఎనిమిది ప్రదిక్షణలు చేసి స్వామి విగ్రహం పక్కనే ఆ స్వామిముఖంలోనికి చూస్తూ కూర్చుంది. అలా గంట గడిచింది. అన్ని పులులు అడవిలోకి వెళ్లిపోయాయి. కానీ ఈ పులి మాత్రం అక్కడే ఉంది. సృష్టిలోని సకల జీవరాశులనూ ఆకర్షించే అద్భుత అందం ఆ శ్రీనివాసునిదే. ఆ స్వామి అంత మనోహరంగా ఉంటాడు కాబట్టే మనం ఎన్నో కష్టాలు పడి గంటలతరబడి క్యూలో నిల్చుని ఒక్క క్షణం దర్శనం చేసుకున్నా, బయటకు రాగానే మళ్ళీ ఎప్పుడు వస్తామా అనిపిస్తుంది. ఆ దివ్య మనోహరరూపమే ఈనాడు ఇన్ని కోట్లమందిని నిత్యం ఆకర్షిస్తోంది. మొన్న మొన్నటిదాకా ఏదో సెలవు రోజులల్లోనో, వారాంతాలలోనో భక్తులు ఎక్కువ వస్తారని అనుకునేవాళ్ళం. ఇప్పుడు నిత్యం భక్తజన ప్రవాహమే. ఆ స్వామిలోని దివ్య ఆకర్షణఅంతటిది.

ఇందాక ఆ స్వామి వద్ద కూర్చున్న పులి కాసేపటికి అడవిలోనికి వెళ్ళిపోయింది. ఆ పులి రోజు ఉదయాన్నే వచ్చి కాసేపు అలా ప్రదక్షిణలు చేసి తిరిగి అడవిలోకి వెళ్ళిపోయేది. ఈ విషయం కొందరు దేవతలు గమనించారు. ఒకనాడు ఇంద్రుడు శ్రీనివాసుని ఇదే ప్రశ్న అడిగాడు. స్వామీ ఈ పులి ఎందుకు ఇలా చేస్తోంది? ఏ భాషా తెలియని, ఏ జ్ఞానమూ లేని ఈ పులి ఎందుకు ఇలా ప్రతిరోజు ప్రదక్షిణలు చేస్తోంది? ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది అన్నాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు ఇంద్రునితో ఇలా అన్నారు. ఇంద్రా దీనికి కారణం చెబుతాను విను, ఈ తిరుమల కొండలన్నీ నాకు ఎంతో ప్రీతికర ప్రదేశం. ఈ అఖండ సృష్టిలో నాకు అత్యంత ఇష్టమైన ప్రదేశం. అందుకే నేను ఈ కలియుగంలో శ్రీనివాసునిగా ఈ కొండపై వెలిశాను. ఇది కలియుగ ప్రారంభం మాత్రమే. ఇప్పటికి ఇంకా మానవులకు నా ఉనికి తెలియదు. అయితే నన్ను శ్రీమన్నారాయణుని రూపంలో కొలిచే భక్తులు ఎందరో ఉన్నారు.

వీరిలో కొందరు నేనే సర్వంగా భావిస్తారు. సర్వకాల సర్వావస్థలయందు నన్నే తలుస్తూ ఉంటారు. వారిలో కొందరు నాకెంతో ఆప్తులు. వారికి నా ఈ శ్రీనివాసుని రూపంలో దర్శనం ఇవ్వాలని తలచాను. ఇక్కడ కొండపై అనేక క్రూరమృగాల రూపంలో తిరుగుతున్న వారందరూ నా భక్తులే. ఇక ముందు కాలంలో వీరిలో కొందరు తిరిగి మానవులుగా జన్మించి నా వద్దకు వస్తారు. నన్ను దర్శనం చేసుకుంటారు. మీరు ప్రతిరోజు చూస్తున్న ఈ పులి కిందటి జన్మలో నాకు ప్రియభక్తుడు. కానీ ఆ జన్మలో చేసిన చిన్న తప్పిదాల వలన ఈసారి మానవజన్మ రాలేదు. ఈ పులిరూపంలో జన్మించాడు. అయినా అతడికి పూర్వజన్మ వాసనలు పూర్తిగా పోలేదు. అందుకే ప్రతిరోజు ఇలా నాకు ప్రదక్షిణనమస్కారాలు చేస్తున్నాడు. ముందు జన్మలలో ఒక జన్మలో ఒకసారి అతను ఒక గొప్ప వైష్ణవభక్తుడై, ఇక్కడ నా ఆలయం పూర్తిగా రూపుదిద్దుకున్నాక ఇక్కడే అర్చకత్వం నిర్వర్తిస్తూ రోజూ నన్ను దర్శించుకుంటాడు అని చెప్పాడు శ్రీమన్నారాయణులవారు. ఇదంతా విన్న దేవేంద్రునితో కలిసిన దేవతలందరూ శ్రీమన్నారాయణులవారి భక్త వాత్సల్యానికి ఎంతో సంతోషించారు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్



**అయిదవ అధ్యాయం**

## కట్టెదుట వైకుంఠము కాణాచైనకొండ ...

సాక్షాత్తూ వైకుంఠమే ఈ తిరుమలకొండలు. శ్రీమన్నారాయణులవారు కలియుగంలో మనలందరినీ అనుగ్రహించడానికై శ్రీనివాసునిగా వెలసిన ఈ తిరుమల సృష్టిలోకెల్ల అతి పవిత్ర ప్రదేశం. సంవత్సరం పొడుగునా అద్భుతమైన ప్రకృతి సంపదతో అలరారుతూ ఉంటుంది. పూర్వకాలంలో తిరుచానూరులో వేంకటాచలపతి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడెంతో గొప్ప విష్ణుభక్తుడు. నిత్యం శ్రీనివాసునే తలుస్తూ ఉండేవాడు. ఆ రోజులలో భక్తులందరూ తిరుచానూరులోని స్వామివారినే దర్శించుకుని వెళ్లేవారు. అప్పటికి ఇంకా తిరుపతి పట్టణం లేదు. తిరుచానూరు, తిరుచ్చకనూరు, తిరుచ్చోగినూరు, తిరుసుకనూరు, తిరుక్కడవూరు, శ్రీ సుఖగ్రామం, కాదిరాజపురం, అని అనేక పేర్లతో పిలువబడేది. తిరుమల యాత్ర చేయడం చాలా దుర్లభం కాబట్టి బ్రహ్మోత్సవం కూడా ఇక్కడే నిర్వహించేవారు.

ఇలా ఉండగా వేంకటాచలపతికి వివాహమైన ఎన్నాళ్ళకీ సంతానం కలుగలేదు. సంతానం కోసం ఆ దంపతులు స్వామిని ఎంతో వేడుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. వారి మనస్సులలో ఎప్పుడూ ఈ విషయం ఎంతో బాధగా ఉండేది. ఒకనాడు వేంకటాచలపతి ఆ స్వామితో తాను వరుసగా నలభై రోజులపాటు కొండమీదనే ఉండి ఆలయం వద్దనే పడుకుని దీక్షగా గడుపుతానన్నాడు. తనకు సంతానం ప్రసాదించమని ఆ స్వామికి మొక్కుకున్నాడు. ఆ రోజుల్లో కొండమీద ఎవ్వరూ ఉండేవారు కాదు. కొంతమంది ఆచార్యపురుషులు ఉదయాన్నే కొండ ఎక్కి మధ్యాహ్నంకల్లా కిందకు దిగేవారు. వారు కూడా వారంరోజులుఒ కకుటుంబం,ఆ తరువాతవ ఒరొకకుటుంబంఇ లావెళ్ళేవారు. సాయంత్రం అయితే చిరుతపులులు, ఎలుగుబంట్లు ఆలయ పరిసరాల్లో తిరిగేవి. అడవిపందులైతే చెప్పనక్కరలేదు. పగటిపూటనే తిరిగేవి. ఇక కోతులు, కొండ ముచ్చులు అయితే విపరీతంగా ఉండేవి. ఇటువంటి పరిస్థితులలో కొండపైననే నలభై రోజులు ఉండటం అత్యంత సాహసం. అయితే వేంకటాచలపతి ఎలాగైనా కొండమీదనే ఈ నలభైరోజులు గడుపుతానని గట్టి దీక్ష తీసుకున్నాడు. అన్నిటికీ తాను నమ్మిన ఆ స్వామే ఉన్నాడని అనుకున్నాడు. తనను ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడతాడు అని వేంకటాచలపతికి ప్రగాఢ విశ్వాసం.

భార్య, బంధువులు వేంకటాచలపతిని అంతటి సాహసం చేయవద్దని ఎంతో వారించారు. కొండపై అన్నిరోజులు ఉండటం ఎంతో ప్రమాదకరమని చెప్పారు. కానీ వేంకటాచలపతి తన పట్టు విడువలేదు. ఈ విశ్వాన్ని మొత్తం రక్షిస్తున్న ఆ స్వామికి తనను ఒక్కడినీ రక్షించడం ఒక లెక్కా అన్నాడు. ఒక మంచిరోజు చూసుకుని కొన్ని బట్టలు మూట కట్టుకుని కొండనెక్కటం ప్రారంభించాడు. అతనికి దారిలో మరో ఇద్దరు భక్తులు కనపడ్డారు. కొంచెం ముందుకు వెళ్ళేసరికి మరొక ఇద్దరు భక్తులు కలిశారు. అందరూ కలిపి ముందుకు నడవసాగారు. కొద్ది దూరం నడవగానే ఒక చిరుతపులి పక్కన ఉన్న అడవిలోనుంచి వీరి మీదకు దూకింది. వీ రి పై ప్రాణాలు పైనేపోయాయి. అ ందరూగట్టిగాగోవిందాఅ ని ఎలుగెత్తి అన్నారు. అక్కడితో ఆ చిరుత ఏదో మంత్రం వేసినట్లు వచ్చినంత



వేగంగా పక్కన అడవిలోనికి వెళ్ళిపోయింది. వీరి మనస్సు స్థిమితపడింది. తిరిగి నడక ప్రారంభించారు.

సమస్త ప్రాణికోటి హృదయాలలో ఆత్మరూపంలో ఉన్నది ఆ శ్రీనివాసుడే! శ్రీమన్నారాయణులవారే మనందరికీ బాహ్యంగా కనిపించే పన్నెండు మాసాల రూపంలో కాలపురుషునిగా ఉన్నారు. పన్నెండు పౌర్ణములు, పన్నెండు అమావాస్యలు కలిపి ఈ ఇరవై నాలుగింటికి ప్రతీకంగా శ్రీమన్నారాయణులవారు ఇరవై కేశవ నామాలతో ఆరాధింపబడుతుంటారు. ఈ ఇరవై నాలుగు రూపాలను ఆ పరబ్రహ్మమూర్తి తన చతుర్భుజాలలో శంఖము, చక్రము, గధ, పద్మము, రకరకాల క్రమాలలో అలంకరించి ఉంటారు. శ్రీ స్వామివారు శ్రీనివాసునిగా ఈ ఇరవైనాలుగు రూపాలలో ఇక్కడ తిరుమల కొండపై నిత్యం సంచరిస్తూ ఉంటారు. ఎంతో తపస్సంపన్నులు, సిద్ధ పురుషులు మాత్రమే ఇది గ్రహించగలుగుతారు. సామాన్యభక్తులకు ఆ స్వామి సంచారం వలన దివ్యతరంగాలు శరీరంలో ప్రసరించి ఎంతో ఆనందభరితులౌతారు.

అది వర్షాకాలం కావడంతో తిరుమల కొండలన్నీ నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. వీరు నడిచి ఎక్కుతున్నప్పుడు కొన్ని చోట్ల చల్లని నీరు కాళ్లక్రింద ప్రవహిస్తోంది. ఒక్కోసారి ఆ నీటిలో పెద్ద పెద్ద పాములు వేగంగా వెలుతున్నాయి. మధ్య మధ్యలో అడవి తేనెటీగల సమూహాలు. ఏ మాత్రం అలజడి చేసినా ఒక్కసారి కుడతాయి. ఈ భక్తులు అందరూ అలా జాగ్రత్తగా కొండనెక్కి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో ఉన్న అర్చకులు కలిసి స్వామిని తనివితీరా దర్శించుకున్నారు. వేంకటాచలపతి శ్రీనివాసుని అద్భుతమైన స్తోత్రాలతో స్తుతించాడు. ఆచార్యపురుషులు ఈ స్తోత్రాలు విని ఎంతో సంతోషించారు. ఇక కాసేపటికి ఆలయం మూసేవేళైంది. ఆచార్యులు, భక్తులు, కొండ దిగడానికి సంసిద్ధమౌతుంటే వేంకటాచలపతి మాత్రం తానిక్కడే ఉంటానని అన్నాడు. తన నలభైరోజుల దీక్ష గురించి చెప్పాడు. అప్పుడు వారందరూ ఇక్కడ రాత్రి ఒంటరిగా ఉండటం ఏమాత్రం క్షేమం కాదని అన్నారు. కానీ వేంకటాచలపతి ఒప్పుకోలేదు.

తన ప్రాణం పోయినా పర్వాలేదు, తాను మాత్రం తన దీక్ష విడవనని చెప్పాడు. వారు ఇక చేసేది లేక కొండ దిగి వెళ్ళిపోయారు. వేంకటాచలపతి ఆ స్వామి విగ్రహం పక్కనే కూర్చుని స్వామివారి దివ్య మంగళ మనోహర విగ్రహాన్ని చూస్తూ ఎంతో ఆనందపడుతూ మరెన్నో స్తోత్రాలు పటించాడు.

ఇంతలో సమయం సాయంత్రం 5 గంటలయింది. పూర్తిగా చీకటి పడసాగింది. వేంకటాచలపతి ఆలయం బయటకు వెళ్లి దగ్గరలో ఉన్న జామచెట్లనుంచి కొన్ని జామపండ్లు కోసుకున్నాడు. రాత్రి తనకి అవే ఫలహారం. అవి తెచ్చుకుని ఆలయం లోపల స్వామివద్దనే కూర్చున్నాడు. బయట పూర్తిగా చీకటి పడింది. కొండలలో ఎక్కడెక్కడో అడవి మృగాల అరుపులు వినిపిస్తున్నాయి. తనదగ్గరున్నపండ్లనుస్వామికినివేదించితానూతిన్నాడు. దూరంగాఎక్కడో పెద్దపులి గాండ్రింపు... ఇంతలోనే కోతుల కిచకిచలు... ఏనుగుల ఘీంకారాలు... రాత్రి అవుతున్నకొద్దీ క్రూరమృగాల అరుపులు ఎక్కువకాసాగాయి. ఆలయ పరిసరాల్లోనే అవి తిరుగుతున్నాయి. వేంకటాచలపతి ఆ స్వామివారినే ప్రార్థిస్తూ విగ్రహానికి దగ్గరలోనే పడుకున్నాడు. కాసేపట్లోనే వేంకటాచలపతికి నిద్రపట్టింది. కోనేటిరాయుని చెంత ఎవరికీ ఏ భయం లేదు, హాయిగా కంటినిండా నిద్రపోయాడు.

నిద్రలో వేంకటాచలపతికి అద్భుతమైన కల వచ్చింది. ఆ కలలో ఎందరో దేవతలు కనపడ్డారు. ఆ కలలో కనపడిన దేవతలందరూ ఇక్కడకు వచ్చి శ్రీనివాసుని అనేక పుష్పాలతో పూజిస్తున్నారు. కొందరు అద్భుతమైన కీర్తనలు పాడుతున్నారు. అప్సరసలు కొందరు స్వామిఎదురుగా నృత్యం చేస్తున్నారు. ఇంతలో తెల్లవారింది. ఉదయం 4 గంటలకే వేంకటాచలపతికి మెలకువ వచ్చింది. శ్రీనివాసునికి నమస్కరించి అడవిలోనికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని శ్రీ స్వామివారి పుష్కరిణిలో స్నానం చేశాడు. పక్కనే ఉన్న అద్భుతమైన పూలమొక్కలనుండి రంగు రంగుల పూలను తీసుకుని అటు పక్కన ఉన్న పండ్ల చెట్లనుండి పళ్ళను తీసుకుని ఆలయంలోనికి వచ్చాడు.



ఆలయంలోకి నెమ్మదిగా సూర్యభగవానుడి వెలుతురు పడుతోంది. అక్కడకు వచ్చిన వేంకటాచలపతికి ఆలయం నిండా అద్భుతమైన పుష్పాలు కనపడ్డాయి. వేంకటాచలపతికి అసలు విషయం అర్థమైంది. తనకు రాత్రి కనపడినదంతా నిజమేనన్నమాట! రాత్రి తాను నిద్రపోయినప్పుడు దేవతలందరూ వచ్చి స్వామివారిని కొలిచారని అర్థమైంది. అక్కడ ఉన్న పూలన్నీ తీసి ఆలయమంతా శుభ్రపరచాడు. తనవెంట తెచ్చుకున్న పండ్లను స్వామివారికి నివేదించాడు. ఇంతలో ఉదయం పదిగంటలయింది. కొండకిందనుంచి అర్చకులు వచ్చారు. వేంకటాచలపతి వారితో తనకు వచ్చిన కలగురించి చెప్పాడు. అందరూ అతని అదృష్టానికి వారెంతో సంతోషపడ్డారు. మీ జన్మ ధన్యమైనదని అన్నారు. ఎన్ని జన్మల పుణ్యఫలమో కదా అని అన్నారు. ఈవిధంగా వేంకటాచలపతి నలభైరోజులు కొండపైననే గడిపాడు. ఇక రేపు ఉదయాన్నే పూజచేసి కొండ దిగి వెళ్లాలి. స్వామిని వదిలి వెళుతున్నాననే బెంగతో ఆలోచిస్తూ నిద్రపోయాడు.

దాదాపు రెండు గంటలవేళ వేంకటాచలపతికి ఏదో పెద్ద కాంతి తనమీద పడినట్టు అనిపించి నిద్రలేచాడు. ఎదురుగా కనపడిన దృశ్యం చూసి అతనికి నోట మాటరాలేదు. శ్రీనివాసుడు చతుర్భుజుడై చిరునవ్వుతో దర్శనమిస్తున్నాడు. నుదుట తెల్లని నామం రెండు చేతులలో శంఖు చక్రాలు. మరో రెండు చేతులలో శార్ఙ్గము, గద, మెడలో అద్భుతమైన హారాలు... పెదవులపై చక్కటి చిరునవ్వు... ఆ దివ్య రూపాన్ని చూసిన వేంకటాచలపతి నోట మాటరాలేదు. శ్రీ స్వామివారి దివ్య మనోహర రూపం చూసి సమ్మోహితుడయ్యాడు. వెంటనే తేరుకుని కనులవెంట ఆనందభాష్పాలు కారుతుండగా స్వామివారితో ఇలా అన్నాడు. ఓ జగన్నాథా! జానకీ వల్లభా! ఈ దీనుని కరుణించి నీ అద్భుత దర్శనమిచ్చావు తండ్రీ. ఎన్నో వేల సంవత్సరాల ఘోర తపస్సుతో కానీ సాధ్యం కాని నీ దివ్యదర్శనంతో నన్ను అనుగ్రహించావు తండ్రీ. ఈ జన్మలో ఏ పుణ్యకార్యాలు చేయలేదు. ఏ యజ్ఞయాగాలు చేయలేదు. నీకు ఏ దివ్య ఆభరణాలు సమర్పించలేదు. ఏ దివ్యమైన స్తోత్రాలను పఠించలేదు. అయినా ఇంతటి అల్పుడిని అనుగ్రహించావు తండ్రీ! నీకివే నా నమస్కారములు అని ఆ శ్రీనివాసుని ఎన్నో విధాల కొనియాడాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారి రూపంలో ప్రత్యక్షమైన శ్రీ స్వామివారు వేంకటాచలపతితో ఇలా అన్నారు. నాయనా! వేంకటాచలపతీ! నీ అపారభక్తి నన్నెంతో మురిపింపచేసింది. ఎటువంటి కల్మషాలు లేని నీ మనస్సు ఎంతో పవిత్రమైనది. అంతటి పవిత్ర మనస్సుతో నన్ను ఆరాధించావు. అందుకు నేనెంతో సంతోషించాను. ఎవరైతే నన్ను స్వచ్ఛమైన మనస్సుతో స్మరిస్తారో వారి యోగక్షేమాలు నేనే వహిస్తాను. ముందు ముందు రోజులలో ఈ తిరుమల క్షేత్రం ఎంతో పెద్ద క్షేత్రంగా వెలుగుతుంది. రోజూ లక్షలాదిమంది భక్తులు నన్ను దర్శించుకొనడానికి ఎంతో దూరాలనుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వస్తారు. వారందరినీ నేను అనుగ్రహిస్తాను. నీవు ఎన్నో జన్మలలో చేసిన పుణ్యఫలం వలన నా దర్శనం నీకు లభించింది. నీకు త్వరలోనే చక్కటి కుమారుడు జన్మిస్తాడు. అని చెప్పి శ్రీమన్నారాయణులవారు అంతర్ధానమైనారు. వేంకటాచలపతి తన అదృష్టానికి ఎంతో సంతోషపడ్డాడు.

ఉదయమే శ్రీనివాసుని ఎన్నో విధాల స్తుతించి కొండ దిగి తన ఇంటికి చేరుకున్నాడు. అందరికీ ఈ విషయం చెప్పాడు. శ్రీనివాసుని అనుగ్రహం కలిగినందుకు అతడి భార్య, బంధువులు ఎంతో సంతోషపడ్డారు. శ్రీ స్వామివారు శెలవిచ్చినట్లుగానే ఆ దంపతులకు ఒక శుభముహూర్తాన చక్కటి పిల్లవాడు జన్మించాడు. అతడికి శేషాచార్యులు అని నామకరణం గావించారు. పిల్లవాడిని ఎత్తుకుని అప్పుడప్పుడు తిరుమల వెళ్లి శ్రీ స్వామివారిని దర్శించుకున్నాడు. పిల్లవాడికి అయిదు సంవత్సరాలు వచ్చాయి. అయిదవ పుట్టినరోజు ఆ శనివారమే. ఈసారి పుట్టినరోజునాడు పిల్లవాడితో సహా శ్రీనివాసుని దర్శనం చేసుకోవాలని సంకల్పించారు. శేషాచార్యులు చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండేవాడు. అయిదు సంవత్సరాలకే ఎన్నో శ్లోకాలు నేర్చుకున్నాడు.

శుక్రవారంనాడే మధ్యాహ్నం బయలుదేరి కొండకు చేరుకుందామని అనుకున్నాడు. కొందరు స్నేహితులు వీరి వెంట రాగా మధ్యాహ్నం నెమ్మదిగా కొండనెక్కసాగారు. రాత్రికి తిరుమలపైనే ఉండి ఉదయమే పిల్లవాడి పుట్టినరోజున



ఆ శ్రీనివాసుని దర్శించి రావాలని అనుకున్నారు. అందరూ స్వామివారి లీలా విశేషాలను కబుర్లుగా చెప్పుకుంటూ కొండనెక్కసాగారు. కొద్దిగా చినుకు మొదలైంది. వీరందరూ కొద్దిగా తడవసాగారు. అయినా ముందుకు సాగుతున్నారు. ప్రకృతి ఎంతో ఆహ్లాదంగా ఉంది. పిల్లవాడు శేషాచార్యులకు ఇదంతా ఎంతో ఆనందంగా ఉంది. పక్కన ఉన్న చెట్లపై కోతులు అటూ ఇటూ దూకుతుంటే వింతగా చూస్తున్నాడు. రామచిలుకలు, రకరకాల పక్షులు తమ మీదుగా ఎగురుతుంటే ఎంతో ముచ్చట పడుతున్నాడు. అద్భుతమైన ప్రకృతి అందాలను చూస్తున్న ఆ పిల్లవాడికి ఎంతో ఆనందం కలిగింది. అందరూ నెమ్మదిగా నడుతస్తూ కొండ ఎక్కుతున్నారు.

ఇంతలోవ ఁబ్బులుఎ క్కువయ్యాయి. ఒ క్కసారిగాచీ కట్లుక మ్ముకున్నాయి. మామూలుగానే కాలిబాటకు అటు ఇటు చెట్లు ఉండటంతో సూర్యరశ్మి అంతగా పడదు. దీనివలన మధ్య మధ్యలో వెలుతురు తక్కువగా ఉంటుంది. ఆ చీకట్లో జాగ్రత్తగా చూసుకుంటూ కొండ ఎక్కాలి. లేకపోతే ఈ తీగో అనుకుని, ఏ పాముమీదనే కాలువేసే ప్రమాదముంటుంది. ఇక ఇంతటి కారుమబ్బులు కమ్ముకోవటంతో పూర్తి చీకటిగా అయింది. ఇంతలో వాన కూడా చాలా ఎక్కువైంది. చూస్తుండగానే చాలా పెద్దదైంది. ఇక ముందుకు నడిచే వీలు లేదు. వర్షంలో అందరూ తడిచి ముద్దయ్యారు. ఇక ఎక్కడైనా ఒక పెద్దచెట్టుకింద తలదాచుకుందామని అనుకున్నారు. ఒక పది అడుగులు వేయగానే వారికి పక్కనే ఒక శిథిలమైన పురాతన మండపం కనపడింది. అందరూ దాని కిందకు వెళ్ళి తలదాచుకున్నారు. తమ బట్టలు తీసి గట్టిగా పిండుకున్నారు. తమతో తెచ్చుకున్న బట్టలు కూడా పూర్తిగా తడిచిపోయాయి. వాటిని తీసుకుని పక్కనే ఆరవేశారు. వర్షం ఏమాత్రం తగ్గలేదు.

ఇక ఈ చీకట్లో కొండ ఎక్కటం ఈ రాత్రికి సాధ్యం కాదని తలచారు. ఇక ఇక్కడే ఉండాలని అందరూ నిశ్చయించుకున్నారు. తమతో తెచ్చుకున్న పులిహోర తిని, కొన్ని పండ్లను తిని అందరూ పడుకున్నారు. పిల్లవాడిని వారిమధ్యలో పడుకోబెట్టుకున్నారు. అలసి ఉండటంచేత అందరికీ వెంటనే నిద్రపట్టింది.

అంతలో తెల్లవారింది. ఒక్కొక్కరు నిద్ర లేవసాగారు. ఇంతలో వేంకటాచలపతి ఒక్కసారిగా గట్టిగా అరిచాడు. రాత్రి తమ పక్కనే పడుకున్న కుమారుడు శేషాచార్యులు కనిపించడంలేదు. అందరికీ ఆందోళన ఎక్కువైంది. అటూఇటూ వెతికారు. పిల్లవాడు ఏమయ్యాడేమోనని అందరిలోనూ ఆందోళన కలిగింది. ఇక తల్లి మహాలక్ష్మి సంగతి చెప్పనక్కరలేదు. విల విల ఏడవసాగింది. రాత్రివేళ ఏ క్రూరమృగమో పిల్లవాడిని అడవిలోనికి ఈడ్చుకువెళ్ళిందేమో? ఈ ఆలోచనే భయంకరంగా ఉంది. అప్పుడు వేంకటాచలపతి గొంతెత్తి ఆ శ్రీనివాసుని గట్టిగా ప్రార్థించాడు. ఓ శ్రీనివాసా! అనాథ రక్షకా! ఆపద మొక్కులవాడా! నమ్ముకున్నవారిని రక్షించేదైవం కదా తండ్రీ నీవు, పిల్లవాడిని నీవే కాపాడాలి తండ్రీ! నీవు తప్ప మాకు మరొక్కరు దిక్కులేదు. ఆ పిల్లవాడిని కాపాడి మావద్దకు చేర్చు తండ్రీ! అంటూ దీనంగా ప్రార్థించాడు.

అంతే! భక్తసులభుడైన శ్రీనివాసుడు ఆ దీనదంపతుల మొర ఆలకించాడు. శేషాచార్యుడు పక్కన అడవిలోనుంచి పరుగు పరుగున వీరివద్దకు వచ్చాడు. అందరి కళ్ళలోనూ ఆనందం. తల్లి ఆ పిల్లవాడిని తీసుకుని ముద్దులతో ముంచెత్తింది. అప్పుడు పిల్లవాడు తండ్రితో ఇలా అన్నాడు. రాత్రి నాకు నిద్రమధ్యలో మెలకువ వచ్చింది. పక్కనే ఉన్న పొదలదగ్గర చక్కటి కుందేళ్ళు కనపడ్డాయి. వాటితో ఆడుకుంటూ అడవిలోకి వెళ్ళిపోయాను. అలా వెళ్ళిన తరువాత నాకు వెనక్కి రావటం తెలియలేదు. గట్టిగా ఏడవసాగాను. అప్పుడు హనుమంతులవారు వచ్చి నన్ను ముద్దుపెట్టుకుని ఏడవవద్దని, భయంలేదని చెప్పారు. నిన్ను నీ తల్లిదండ్రులవద్దకు తీసుకువెళతానని చెప్పారు. నన్ను ఎత్తుకుని అదిగో అక్కడ దూరంగా దింపి అడవిలోకి వెళ్లిపోయారు. అక్కడినుంచి ఇలా నడుచుకుంటూ వచ్చాను అని అన్నాడు. హనుమంతులవారు అలా అనుగ్రహించినందుకు వేంకటాచలపతి దంపతులిద్దరూ ఎంతో సంతోషపడ్డారు. పుట్టినరోజునాడు శ్రీ హనుమంతులవారి దర్శనం కలగటం ఆ పిల్లవాడి అదృష్టంగా భావించారు. అందరూ శ్రీనివాసునికి నమస్కరించి వడి వడిగా కొండ ఎక్కి ఆలయం చేరుకుని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అటుతరువాత కొండదిగి వారింటికి వచ్చారు. వేంకటాచలపతి కుటుంబం నిత్యం శ్రీ



స్వామివారినే సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

ఆరవ అధ్యాయం

## తిరువీధుల మెరసి దేవదేవుడు ...

పూర్వకాలంలో తిరుమలను ఎందరో సాధువులు, యోగులు దర్శించేవారు. తిరుమల కొండలలోని తీర్థాలవద్ద ఇంకా అడవిలోపల గుహలలోను ఎందరో యోగులు తపస్సు చేసుకునేవారు. వీరిలో కొందరు ఎప్పుడైనా ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకునేవారు. ఆ రోజులలో రోజుకి నూరుకుమించి యాత్రికులు వచ్చేవారు కారు. కొండపై నాలుగైదు అర్చక కుటుంబాలవారు నివసించేవారు. ఏదైనా ఉత్సవాలు జరిగినప్పుడు భక్తులు రాత్రి కొండపైననే పడుకునేవారు. మిగిలిన రోజుల్లో అందరూ సాయంత్రానికల్లా కొండ దిగి తిరుపతి చేరుకునేవారు.

ఆ రోజుల్లో బ్రహ్మోత్సవాలు ప్రతినెలా జరిగేవి. బ్రహ్మోత్సవ సమయంలో శ్రీ స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి ఆలయ మాడవీధులలో విహరిస్తుంటే కనిన భక్తుల ఆనందానికి అంతు ఉండదు. ఆ కమనీయ దృశ్యం ఎంతో కన్నుల పండుగగా ఉంటుంది. ఇప్పటికీ బ్రహ్మోత్సవాలలో సర్వ దేవతాగణమూ తిరుమల కొండపైనే ఉంటుంది. దేవతలందరూ ఆ పది రోజులు



అదృశ్యరూపాలలో కొండపై విహరిస్తుంటారు. కొందరైతే సామాన్య భక్తులరూపంలో భక్తుల మధ్యన తిరుగుతుంటారు. అందువలననే బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమల కొండలు ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. ఒకసారి ఇలా వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో ఎందరో సాధువులు, యోగులు కూడా పాల్గొన్నారు. భక్తులతో పాటు స్వామివారి ఊరేగింపులో వీరు కూడా పాల్గొనేవారు. వీరందరూ నిత్యం ఆ స్వామినే స్మరిస్తూ ఉండేవారు కాబట్టి వీరందరూ ఎందరో తేజస్సుతో వెలిగిపోతుండేవారు. అప్పటికి కొండపై ఒకటి రెండు మఠాలు కూడా వచ్చాయి. రాత్రిపూట ఈ సాధువులందరూ ఆ మఠాలలో నిద్రించేవారు. అయితే ఆ సారి వచ్చిన సాధువులలో ఒక సాధువు మాత్రం అందరికంటే ఎక్కువ తేజస్సుతో వెలిగిపోతూ ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవాడు. అతడు సాయంత్రం అయ్యేసరికి మఠాలలో ఉండకుండా అడవిలోనికి వెళ్ళిపోయేవాడు. వ ఎరలాఉ దయాన్నేతి రిగిఅ డవినుంచిబ యటకువ చ్చేవాడు. అతడి తేజస్సు చూసేసరికి భక్తులందరూ ఎంతో ఆశ్చర్యపోయేవారు. స్వామివారు ఆలయ వీధులలో అనేక వాహనాలలో విహరిస్తున్నప్పుడు ఈ సాధువు ఎన్నో అద్భుతమైన కీర్తనలు పాడుతుండేవాడు. అతనిగొంతులో ఏదో తెలియని దివ్యత్వం ఉండేది. ఆ సాధువు ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎవరైనా దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తే చేయి ఎత్తి చిరునవ్వుతో ఆశీర్వదించేవాడు. అంతే తప్ప ఏమీ మాట్లాడేవాడు కాదు.

ఇలా అయిదురోజులు గడిచాయి. ఈ సాధువును చూస్తున్న భక్తులలో చంద్రయ్య అనే భక్తుడికి ఈ సాధువు ఎవరో అతడిపేరు ఏమిటో తెలుసుకోవాలనే ఉత్సాహంఉ ండేది. రోజూఆ యనవెంటేతి రుగుతూఏ వో ్రపశ్నలువేసేవాడు. అయితే ఆయన చిరునవ్వు నవ్వేవాడు తప్పితే ఏమీ మాట్లాడేవాడు కాదు. రోజు రోజుకు చంద్రయ్యకు కుతూహలం ఎక్కువ కాసాగింది. ఎవరీ సాధువు, ఎందుకు అస్సలు మాట్లాడడు. అడవిలో ఎక్కడ ఉంటాడు? రాత్రి అడవిలో ఒక్కడుగా ఉండటానికి అతడికి భయం కలగదా? ఇలా అనేక ప్రశ్నలు అతని మదిని తొలిచేవి. ఎలాగైనా ఈ సాధువు ఎక్కడికి వెళుతున్నాడో రేపు తప్పక చూడాలని అనుకున్నాడు. ఆ మరునాడు కూడా ఆ సాధువు ఉదయాన్నే అడవిలోనుంచి

బయటకు వచ్చి శ్రీ స్వామివారి వాహన ఊరేగింపులో నడవసాగాడు. చంద్రయ్య మళ్ళీ ఆ సాధువునే అనుసరిస్తూ నడవసాగాడు. ఊరేగింపు అయిన తరువాత ఆ సాధువు ఆలయ సమీపంలోనే కీర్తనలు పాడుతూ అటూ ఇటూ తిరుగుతున్నాడు.

చంద్రయ్య దూరంనుంచే ఆ సాధువును జాగ్రత్తగా గమనింపసాగాడు. సాయంత్రం నాలుగు గంటల సమయం కాగానే సాధువు నెమ్మదిగా నడుస్తూ అడవివైపు నవడసాగాడు. చంద్రయ్య కూడా దూరంగా నడుస్తూ ఆ సాధువునే అనుసరిస్తున్నాడు. ఆయన అలా నడుస్తూ అడవిలోకి వెళ్ళాడు. చంద్రయ్య అలా నడుస్తూ చెట్లపక్కగా దాక్కుంటూ ఆ సాధువును అనుసరిస్తున్నాడు. ఇంతలో ఒక్కసారిగా ఆ సాధువు నడుస్తున్నచోట పెద్ద వెలుగు వచ్చింది. ఆ వెలుగులో సాధువు మాయమై దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న ఒక పెద్ద వానరం చంద్రయ్యకు కనిపించింది. ఆ దివ్య వానరం క్షణంలో అడవిలోకి మాయమైంది. ఆ క్షణంలో మరొక సంఘటన జరిగింది. చంద్రయ్యకు ఒక్కసారిగా కనుచూపు పోయింది.

అంతే చంద్రయ్య హాహాకారాలు పెట్టసాగాడు. జరిగింది అర్థమైంది. ప్రతీరోజు ఈ అడవిలోనుంచి వస్తూ శ్రీ స్వామివారి వాహనసేవలో పాల్గొంటున్న సాధువు మరెవరో కాదు, సాక్షాత్తూ ఆంజనేయుడే. ఆ ఆంజనేయస్వామివారే ప్రతీరోజూ ఆ సాధువు రూపంలో వచ్చి ఆ శ్రీనివాసుని సేవిస్తున్నాడు. తన మూర్ఖత్వానికి చంద్రయ్య ఎంతో బాధపడ్డాడు. స్వామి దర్శనం అయిన ఈ కళ్ళతో ఇక ఈ లౌకిక ప్రపంచం చూడటానికి వీలు లేదు. అందుకే కంటిచూపు పోయిందని చంద్రయ్యకు అర్థమైంది. చంద్రయ్యకు ఒకవైపు శ్రీ హనుమంతుల వారి దర్శనం అయినందుకు సంతోషం, మరొకవైపు కంటిచూపు పోయిందనే బాధ పట్టుకున్నాయి. ఇంతలో అతడి బంధువులు చంద్రయ్య ఎక్కడ తప్పిపోయాడా అని వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చారు. జరిగినదంతా చంద్రయ్య వివరించాడు. అది విన్న బంధువులు ఎంతో ఆశ్చర్యపోయారు. ఇక ఎవరూ ఇటువంటి పని చేయకూడదని నిశ్చయించుకున్నారు. కొండమీద కనపడే ప్రతీ సాధువు ఆమాటకు వస్తే ఏ సామాన్య భక్తునిలా కనిపించే ఎవరైనా ఏ దేవతో అయి ఉండవచ్చునని వారికి తెలిసింది. అందరి ఎడల భక్తిభావం ఉండాలని, ఎవరినీ



అనుమానంగా చూడకూడదని నిశ్చయించుకున్నారు.

తిరుమలకొండపై ఎందరో దేవతలు నిత్యం అనేకరూపాలలో తిరుగుతుంటారు. ఇప్పటికీ మనం ఈ కొండపై కొందరు సాధువులను, యోగులను చూస్తుంటాం. వీరిలో ఎవరు ఏ దేవతా స్వరూపులో అతి సామాన్యులమైన మనం గ్రహించలేము. మనం చెయ్యవలసిందల్లా వారికి ఒక నమస్కారం పెట్టి ముందుకు సాగడమే! దేవతలకు ఈ తిరుమల కొండలు అత్యంత ప్రాణప్రదం. అనేక దివ్యరూపాలలో, అదృశ్యరూపాలలో వారు ఇక్కడ నిత్యం భక్తులమధ్య తిరుగుతూ వారికబుర్లు వింటుంటారు. శ్రీనివాసుని గురించి భక్తులు చెప్పుకునే ముచ్చట్లు వింటూ ఎంతో ఆనందపడతారు. ఒక్కోసారి మన తిరుపతి యాత్రలో మనం శ్రీ స్వామివారి దర్శనం గురించి మన బంధువులతో, స్నేహితులతో సంతోషంగా చెప్తుంటే మన పక్కనే నడుస్తున్న ఒక అపరిచిత భక్తుడు చిరునవ్వు నవ్వుతూ మన మాటలన్నీ వినటం గమనిస్తున్నాము. ఇది ఎంతో మంది భక్తులకు అనుభవైక వైద్యమే. అలా చిరునవ్వుతో మనల్ని చూస్తున్న భక్తుడు ఇంద్రుడో, చంద్రుడో ఎవరైనా దేవత కావచ్చు. అలా వారు మనకి కనపడటం మన భాగ్యంగా భావించాలి.

ఎంతమాత్రమున ఎవరు పిలిచిన అంత మాత్రమే నీవు అంటారు అన్నమాచార్యుల వారు... శ్రీనివాసుడు నమ్మినవారికి కొండంత అండ. ఏ పేరుతో పిలిచినా కో అని పలికే కొండలరాయుడు. ఏ దేవతగా భావిస్తే ఆ దేవత రూపంలో దర్శనమిచ్చి అనుగ్రహించే అమృతమూర్తి. ఆ స్వామిని నమ్మి కొలచినవారికి దేనికీ కొదువ ఉండదు. ఎటువంటి ఆపదలూ దరిచేరవు. సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి. జీవితం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా శుభప్రదంగా... ప్రశాంతంగా సాగిపోతుంది. ఆ స్వామికి భక్తులంటే వల్లమాలిన ప్రేమ. స్వామిని మిత్రునిగా భావించినవారికి మిత్రునిగానే మసలుతాడు. తనకొరకు తపించేవారికోసం తానే తపిస్తాడు. తన దర్శనం కోసం బాధపడే భక్తులకు తన దర్శనం లభించేవరకు ఎంతో తాపత్రయపడే అద్భుత దైవం శ్రీనివాసుడు. ఇలా భక్తుల మనోభావాలన్నింటినీ తానూ అనుభవించే విచిత్ర,

విశిష్ట దేవుడు శ్రీ వేంకటేశ్వరుడు.

పురాతనకాలంలో ఒకనాడు ఒక భక్తబృందం స్వామి దర్శనార్థం కొండ ఎక్కసాగింది. ఆ బృందంలో పదకొండుమంది భక్తులున్నారు. అందరూ శ్రీ స్వామివారి లీలలను తలచుకుంటూ వారి నోటికి వచ్చిన కీర్తనలు పాడుకుంటూ కొండనెక్కసాగారు. తమకు స్వామివారితో జరిగిన అనుభవాలను మిగిలిన వారితో పంచుకుంటూ ముందుకు నడుస్తున్నారు. ఆ స్వామిలీలలను వినడానికి ఎంతో ఆనందదాయకంగా ఉంటాయి కదా! ఇక ఆ పదకొండుమంది ఒక్కొక్కరి అనుభవాలు మిగిలినవారికి చెబుతుంటే విన్నవారందరూ ఎంతో ఆనందంలో మునిగిపోతూ శరీరం మరిచిపోతున్నారు. ఎవరి అనుభవాలు వారికే ప్రత్యేకం కదా! స్వామిని తరతరాలుగా ఎందరో భక్తులు ఎన్నోవిధాలుగా సేవించారు. ఆ స్వామి వీరందరినీ ఎన్నో లీలలతో ఆనందపరిచాడు. అసలు ఆ స్వామి నామమే ఆనందకరం. స్వామి రూపం తలచుకుంటే మరీ ఆనందం. ఒక్కసారి మనసులో స్వామి తిరునామాన్ని తలచుకుంటే ఒళ్ళంతా మాటలలో వర్ణించలేని ఆనందం కలుగుతుంది. శంఖచక్రనామాలతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ శ్రీనివాసుని రూపం ఒక్కసారి మనస్సులో దర్శిస్తే చాలు నోటితో చెప్పలేని దివ్యమైన ఆనందం కలుగుతుంది. ఏ విషయ, ఏ పదార్థాల వలన లభించని ఆనందం ఆ స్వామిని స్మరించటంలో ఉంది. అందుకే ఎందరో యోగీశ్వరులు సైతం స్వామి అనుగ్రహానికైఅ ంతతా పిస్తారు. అ ందుకేస మస్తజీ వకోటిస్వామివారినిని త్యం దర్శించాలని ఉవ్విళ్ళూరుతుంటుంది.

ఆ భక్తబృందం అలా శ్రీ స్వామివారి లీలలను ముచ్చటించుకుంటూ ముందుకు సాగుతున్నారు. అయితే అలా ఆ లీలలలో మునిగిపోయినవారు దారితప్పి అడవిలో వేరేవైపుకు వెళ్ళిపోయారు. కొందరు కొంతదూరం నడవగానే వారికి తాము దారి తప్పామన్న సంగతి తెలిసింది. ఎందుకంటే ముందంతా పెద్దపెద్ద వృక్షాలు కనపడుతున్నాయి. మనుషులు నడిచిన ఆనవాళ్ళు కనపడటం లేదు. అందరిలో అదుర్దా మొదలైంది. దానికితోడు ఎక్కడో దూరంగా అడవిలోనుంచి పెద్దపులుల గాండ్రింపు వినపడింది. ఒక్కసారిగా అందరిలోనూ



ఆందోళన కనపడింది. అందరూ గట్టిగా ఎలుగెత్తి శ్రీనివాసా నీవే శరణం. గోవిందా నీ దివ్యదర్శనానికి సరైన మార్గం చూపించు. అని శ్రీస్వామివారిని వేడుకున్నారు. ఇంతలో వారికి ఎదురుగా ఒక పెద్ద సర్పం కనపడింది. ఆ సర్పం కొండచిలువ కంటే పెద్దదిగా ఉండి పడగెత్తి వీరివైపే చూస్తున్నది. అప్పుడు భయం ఇంకా ఎక్కువైంది. అప్పుడు శ్రీ స్వామివారు వారిలో ఒకరిని ఆవహించి ఇలా పలికారు. ఈ సర్పాన్ని అనుసరించి ముందుకు వెళ్లండి. మీరు నన్ను సులభంగా చేరుకుంటారు అని అన్నారు.

ఇలాశ్రీ నివాసుడుఒ కభ్కక్తునిద్వారాచెప్పగానేఆ స ర్పంవ ముందుకుతి రిగి దూరంగా పాకసాగింది. ఆ సర్పం వెనుకనే ఈ భక్తబృందం గోవింద నామస్మరణతో నడవసాగారు. ఆ అద్భుత సర్పం గుబుర్లను చీల్చుకుంటూ ఇంకా ఇంకా పెద్దదై తనకు అడ్డం వచ్చిన కొమ్మలను తోస్తూ ముందకు దారి చేసుకుంటూ జర జరా పాకసాగింది. దీనివెనుక వీరందరూ వడివడిగా నడవసాగారు. అలా ఆ సర్పాన్నే చూస్తూ వారు ఒక రెండు గంటలు నడవగానే ఆ దివ్యసర్పం ఒక్కసారిగా మాయమైంది. వారు కొన్ని అడుగులు ముందుకు వెయ్యగానే కొండపైకి వచ్చినట్లు గ్రహించారు. ఎదురుగా కోటిసూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్న శ్రీనివాసుని ఆలయం దర్శనమిచ్చింది. జరిగినదంతా వీరికి అర్థమైంది. తమకు దారిచూపిన ఆ దివ్యసర్పం మరెవరో కాదు! సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారి ప్రియభక్తుడైన శ్రీ ఆదిశేషులవారే! తాము నమ్మి కొలిచే ఆ స్వామివారు సాక్షాత్తూ శ్రీ ఆదిశేషులవారినే తమకు దారిచూపించడానికి పంపించారని అర్థమైంది. ఆదిశేషులవారి దర్శనం దొరకటం తమ పూర్వజన్మ సుకృతంగా భావించారు. ఆ భక్తబృందం అంతా ఎంతో ఆనందంతో ఆనందనిలయంలోనికి ప్రవేశించి శ్రీనివాసుని తనివితీరా దర్శించుకున్నారు. ఆ రోజు కొండమీదనే ఉండి, మరునాడు మరొక్కసారి శ్రీ స్వామివారిని దర్శించి కొండ దిగి తమతమ గృహాలకు చేరుకున్నారు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

### ఏడవ అధ్యాయం

## కౌసల్యా సుప్రజా రామా ...

కౌసల్యా సుప్రజా రామా... పూర్వా సంధ్యా ప్రవర్తతే... ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవమాహ్నికం అంటూ అర్చకులు ప్రతిరోజూ ఉదయాన్నే శ్రీనివాసుని స్తుతిస్తారు. ఆ దివ్య సుప్రభాతం వింటూ శ్రీనివాసుడు చిరునవ్వుతో యోగనిద్రనుండి మేల్కొంటాడు. ఆ చిరునవ్వే ఈ విశ్వానికి రక్షా కవచం. ఇక ఆ రోజంతా భక్తకోటికి ఆ చల్లని చూపులే అద్భుత అనుగ్రహ వీక్షణాలు! ఆ చల్లటి చూపుతో శ్రీనివాసుని భక్తులందరూ హాయిగా నిర్భయంగా తమ పనులలోకి వెళ్తారు. రోజంతా శ్రీ స్వామివారు తమ వెంటనే ఉంటారనే ప్రగాఢ విశ్వాసంతో ముందుకు సాగుతారు.

తిరుమలపై వెలసిన శ్రీనివాసుని తరతరాలుగా ఎందరో కొలిచి తరించారు... తరిస్తున్నారు. అలా ఆ స్వామిని సర్వస్వంగా భావించి సేవించిన వారిలో విక్రమసింహుడు అనే రాజు కూడా ఒకరు. విక్రమసింహునికి శ్రీనివాసుడు అంటే ఎంతో భక్తిభావం. ప్రతీ సంవత్సరం మందీ మార్బలంతో తిరుమలకొండలనెక్కి పదిరోజులు కొండపైననే ఉండి శ్రీ స్వామివారిని సేవించుకునేవాడు. విక్రమసింహుడు తన రాజ్యంనుంచి గుర్రాలతో,



ఏనుగులతో, బయలుదేరి ఎన్నో ఊర్లను దాటుకుంటూ తిరుమలకొండనెక్కే దృశ్యం ఎంతో అద్భుతంగా ఉండేది. గుఱ్ఱాలు, ఏనుగులు, ఒంటెలు ఇలా ఎన్నింటిమీదనో అనేకమంది సైనికులు ముందు, వెనుకలుగా రాగా తిరుమల అడవులగుండా కొండనెక్కేవారు. వారిమధ్యలో విక్రమసింహుడు, తన మంత్రులు, రాజ్య పురోహితులు వారి వారి పరివారాలతో కలిసి గుఱ్ఱాలపై కొండనెక్కేవారు. తాను కొండకు వచ్చిన ప్రతిసారి విక్రమసింహుడు శ్రీ స్వామివారికి ఎన్నో కానుకలు సమర్పించేవాడు. కొండపైకి చేరగానే అందరూ అక్కడ గుడారాలు వేసుకునేవారు. ప్రతీరోజు ఉదయమే లేచి మహారాజు విక్రమసింహుడు తన మంత్రులు, రాజ పురోహితులతో కలిసి ఆలయం పక్కనే ఉన్న శ్రీ స్వామివారి పుష్కరిణిలో స్నానం చేసి ఆలయంలోనికి వచ్చి శ్రీనివాసుని దర్శించేవారు. విక్రమసింహునితో కలిసి వచ్చిన పండితులు కొందరు శ్రీనివాసుని కీర్తిస్తూ ఎన్నో శ్లోకాలు చదివేవారు. మరికొందరు చక్కటి కీర్తనలు ఆలపించేవారు. సాయంత్రవేళల్లో విక్రమసింహుడు తన గుడారంలో తన పండితులచేత శ్రీమన్నారాయణులవారి మహిమలు చెప్పించుకునేవాడు. తిరుమలకొండపై వెలసిన శ్రీనివాసుని దివ్య గుణగణాలను వర్ణిస్తూ ఆ స్వామి లీలా విశేషాలను వివరిస్తూ పండితులు చెబుతూ ఉంటే విక్రమసింహుడు భక్తిభావంతో ఒళ్ళు మరిచిపోయేవాడు.

ప్రతీ సంవత్సరం లాగానే ఆ సంవత్సరం కూడా విక్రమసింహుడు తిరుమల వచ్చాడు. అతడి పరివారంలో పదిమంది పండితులు కూడా ఉన్నారు. వారిలో తిరువేంకటనాథాచార్యులు అనే ఆచార్యపురుషుడు కూడా ఉన్నాడు. అతడు వయసులో చిన్నవాడైనప్పటికీ అన్ని శాస్త్రాలలోను అపారమైన పాండిత్యం కలవాడు. తిరుమల రావటం తిరువేంకట నాథాచార్యునికి ఇదే ప్రథమం. శ్రీనివాసుడంటే ఆచార్యులవారికి ఎంతో భక్తి. ఎప్పటినుంచో తిరుమల వచ్చి శ్రీ స్వామివారిని దర్శించాలని ఎంతో కోరికగా ఉండేది. ఇది ఇన్నాళ్ళకు సాధ్యమైంది. మొదటిరోజు మహారాజు విక్రమసింహునితోపాటు ఆలయంలోనికి వచ్చి ఆ స్వామిని దర్శించిన తిరువేంకట నాథాచార్యులు ఎంతో సంతోషించారు. ఆ దివ్య మంగళ మనోహరరూపం చూసి సమ్మోహితుడయ్యాడు. ఆ స్వామిని ఎన్నో విధాల కీర్తించాడు. ఈ కీర్తనలు విన్న విక్రమసింహుడు ఎంతో సంతోషించాడు. ఇంతటి

అద్భుతమైన కీర్తనలు పాడుతున్న మహానుభావుడు తమతో ఉండటం తమ అదృష్టం అన్నాడు. రెండర రోజు ఉదయాన్నే మహారాజు పరివారంతో ఆలయానికి వచ్చాడు. ఆ రోజు పౌర్ణమి. శ్రీనివాసుడు ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఆనాటి స్వామివారి అందం వర్ణించటం మానవమాత్రులవల్ల సాధ్యం కాదు.

అంతటి దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న శ్రీనివాసుని చూసి తిరువేంకటనాథాచార్యులవారికి నోట మాట రాలేదు. ఆనందంతో కనులవెంట నీరు కారింది. ఓ శ్రీనివాసా! నీవు సమస్త లోకాలకు ప్రభువువు... నిన్ను మించిన దైవం మరెక్కడా లేదు. నమ్మి కొలచినవారికి కొండంత అండ నీవు. నీవు వెంట ఉంటే ఈ ప్రపంచంలో మరేమీ అక్కర్లేదు తండ్రీ. నీ అనుగ్రహం లేనివారికి సర్వసౌభాగ్యాలు ఉన్న ఎందుకూ కొరగావు. అని ఆ స్వామివారిని ఎన్నోవిధాల కీర్తించాడు. ఇదంతా విన్న మహారాజు ఎంతో ఆనందించాడు. అతడిలో శ్రీనివాసుని ఎడల భక్తిభావం ఎక్కువైంది. తిరువేంకట నాథాచార్యులు శ్రీనివాసుని స్తుతించిన తీరు ఎంతో అద్భుతంగా ఉంది. ఆ శ్లోకాలు వింటూ, ఆ దివ్య మంగళ మనోహర విగ్రహాన్ని వీక్షిస్తూ మహారాజు మైమరచిపోయాడు.

ఇలా తొమ్మిదిరోజులు గడిచాయి. ఇక రేపు దర్శనం కాగానే తిరిగి తన రాజ్యానికి బయలుదేరాలి. ఆ రోజు సాయంత్రం రాజపరివారం అందరూ రేపటి తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు. అందరూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. అందరిలోనూ శ్రీ స్వామివారిని వదిలి వెళుతున్నామన్న బాధ కనిపిస్తోంది. మహారాజు విక్రమసింహుడు కూడా తన గుడారంలో కూర్చుని స్వామివారి గురించే ఆలోచిస్తున్నాడు. మళ్ళీ సంవత్సరానికి కదా ఇక్కడకు రావటం అని తలుస్తున్నాడు. అప్పుడు అక్కడికి తిరువేంకట నాథాచార్యులు వచ్చారు. అతనిని చూసిన మహారాజు ఏమి స్వామి ఇలా వచ్చారు. ఏదైనా అడగతలచుకున్నారాఅ నిఅ డిగారు. అ ప్పుడుఆ చార్యులవారువ ుహారాజుఇ లా అన్నాడు. ఓ మహారాజా! మీరు కోపగించుకోరంటే నాదొక విన్నపం. ఇక్కడ కొలువై వున్న శ్రీస్వామివారి అద్భుత రూపం నన్నెంతో ఆకట్టుకుంది. మొట్టమొదటిసారి చూసిన నాకు ఆ స్వామిని వర్ణించటానికి నోట మాట రాలేదు. నాదొక చిన్న కోరిక



ప్రభూ. తమరుకోపగించుకోరనితలుస్తున్నాను. నేనుఈ స్వామివారినివి డిచి రాలేకపోతున్నాను. తమరు అనుమతిస్తే శాశ్వతంగా ఇక్కడే ఉండి శ్రీస్వామివారిని సేవించుకుందామని అనుకుంటున్నాను. ఇక్కడే ఉండి నా జీవితమంతా శ్రీ స్వామివారి సేవలోనే గడపాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. నాకు భోగ భాగ్యాలు వద్దు. ఇక్కడ ఉంటే చాలు. అంతకు మించిన భాగ్యం లేదు. దయచేసి నా కోరిక అనుమతించండి అని అన్నాడు.

ఈ మాటలు విన్న విక్రమసింహునికి ఎంతో కోపం వచ్చింది. ఆచార్యులవారితో ఇలా అన్నాడు. ఆచార్య పురుషా! శ్రీనివాసుని విడిచి వెళ్ళడానికి మనందరికీ కూడా కష్టంగానే ఉంది. కానీ మేమందరం వెళ్ళటం లేదా. అదీ కాక మీరు వయస్సులో చిన్నవారు. ప్రతీ సంవత్సరం మాతో వచ్చి ఇంకా ఎన్నోసార్లు శ్రీ స్వామివారిని దర్శించుకొనవచ్చును. మీరు ఇక్కడే ఉండిపోతె, నీవంటి గొప్ప పండితుడు మా పరివారంలో లేకపోవటం మాకెంతో వెలితిగా ఉంటుంది. అక్కడ మమ్ములను నిత్యం మీ అద్భుత ప్రావీణ్యంతో అలరించాలి. అంతగా మీకు తిరుమల రావాలనిపిస్తే మరొక ఆరు నెలల తరువాత మీకు భటులను తోడిచ్చి పంపిస్తాను. అంతేకానీ ఎప్పటికీ ఇక్కడే ఉండాలనే ఆలోచన పెట్టుకోవద్దు. ఇక మీరు వెళ్లవచ్చు. అని అన్నాడు. మహారాజు అలా చెప్పటంతో తిరువేంకటనాథుడు బాధ పడుతూ వెనుతిరిగి తన గుడారానికి వెళ్ళాడు.

గుఢారానికి వచ్చాడు కానీ, ఆచార్యులవారికి ఆ రాత్రంతా నిద్ర రాలేదు. స్వామిని ఎలా విడిచి వెళ్ళటం. మళ్ళీ సంవత్సరం దాకా స్వామిని చూడకుండా ఉండటమా? అసలా ఊహ తలచుకుంటేనే ఎంతో కష్టంగా ఉంది. రేపు ఒక్కొక్క అడుగు దిగి కొండ దిగటం ఎంత కష్టతరం. శ్రీ స్వామివారిని విడిచి వెళ్ళడం ఎంత బాధాకరం అని బాధ పడ్డాడు. ఇంతలో తెల్లవారింది. మహారాజుతో కలిసి ఆలయానికి వెళ్ళి శ్రీ స్వామివారిని దర్శించుకున్నాడు. కనులవెంట ధారగా కన్నీళ్ళు కారుతూ ఎన్నో స్తోత్రాలతో ఆ స్వామిని కీర్తించాడు. స్వామిదగ్గర సెలవు తీసుకుని అందరితోపాటు బయటకు వచ్చాడు. ఆ స్వామి దివ్య మంగళ మనోహరరూపం మనస్సులో పరిగెడుతోంది. ఒక్క క్షణం కూడా స్వామివారి రూపం ఆచార్యులవారి

మనసులోంచి చెదరటం లేదు.

ఇక అందరూ బయలుదేరటానికి సమాయత్తం అయ్యారు. మహారాజు విక్రమసింహుడు తనకోసం సిద్ధం చేసిన గుర్రం ఎక్కాడు. ఆ అశ్వం ఎంతో శక్తి కలది. ఒక్కసారి శ్రీనివాసునికి నమస్కరించి ముందుకు కదలడానికి అశ్వాన్ని అదిలించాడు. ఆశ్చర్యం! అశ్వం ఏమాత్రం ముందుకు కదలలేదు. ఎంత గట్టిగా అదిలించినా ఆ గుఱ్ఱం ఒక్క అడుగు ముందుకు వేయటం లేదు. సర్వసైన్యాధికారివ చ్చిఎ న్నోవిధాలప్ర యత్నించాడు. అ యినాకూడాఆ అ శ్వం ముందుకు కదలటం లేదు. వెంటనే సేనాధిపతి మరొక అశ్వాన్ని తెప్పించారు. మహారాజు దీనిని ఎక్కాడు. ఆశ్చర్యం! ఈ అశ్వం కూడా ఎంత విదిలించినా ముందుకు కదలటం లేదు. ఎందరు ఎంత ప్రయత్నించినా ఈ గుఱ్ఱం కూడా ఏ మాత్రం ముందుకు కదలటం లేదు. ఇదంతా చూస్తున్న అక్కడ ఉన్న వారందరికీ నోట మాట రావటం లేదు. అలా ఏడు అశ్వాలు వచ్చాయి. అయినా మహారాజు ఎక్కిన తరువాత ఏ అశ్వమూ ముందుకు అడుగు వేయటం లేదు. ఇలా ఎందుకు జరుగుతోందో ఎవరికీ అర్థం కావటం లేదు.

అక్కడ ఉన్న అందరిలోనూ ఆందోళన మొదలైంది. మహామంత్రికి ఏమీ పాలు పోవటం లేదు. మహారాజు విక్రమసింహుడికి కోపము, ఆశ్యర్యమూ కలిగాయి. మిగిలిన అందరి గుఱ్ఱాలు ముందుకు సాగుతుంటే తన గుఱ్ఱం మాత్రం ఎందుకు ముందుకు ఒక్క అడుగు వేయటం లేదు, అదీ గుఱ్ఱాలను ఎన్నిసార్లు మార్చినా ఇదే జరుగుతోంది. రాజుకి ఏమీ అర్థం కావటంలేదు. తన ముఖ్య పురోహితుని పిలించి కారణం ఏమై ఉంటుందని అడిగాడు. తనకు ఏమీ అర్థం కావట్లేదని మహామంత్రితో అన్నాడు. మహామంత్రి రాజుతో ఇలా అన్నాడు. మహారాజా మనం ఇక్కడ ఉన్న ఈ పదిరోజులలో స్వామివారికి మన వలన ఏదో అపచారం జరిగి ఉండవచ్చు, లేదా స్వామివారికి ఏమాత్రం ఇష్టం లేనిపని ఏదైనా మనపరివారంలోని వారు ఎవరైనా చేసి ఉండవచ్చు. అందువలననే మీరు ఎక్కిన అశ్వం ఏమాత్రం అడుగు ముందుకు వేయడం లేదు. మహామంత్రి ఇలా చెప్తుండగా అక్కడ విక్రమసింహుడికి వీడ్కోలు పలకడానికి వచ్చిన ఆలయ



పండితులలో ఒకరిపై శ్రీ స్వామివారు ఆవహించి ఇలా అన్నారు. ఓ విక్రమసింహా! నీవు ఒక చిన్న తప్పుపని చేశావు. అది నాకు ఎంతో ఆగ్రహం తెప్పించింది. నాకు ఎంతో ప్రియభక్తుడైన తిరువేంకటనాథాచార్యులు నీ దగ్గరకు వచ్చి తాను శాశ్వతంగా ఇక్కడే ఉండి నన్ను సేవించుకుంటానని అందుకు అనుమతించమని నీకు విన్న వించుకున్నాడు. అందుకు నీవు ససేమిరా కాదన్నావు. అతడు ఎంతో మంచి మనసు కలవాడు. ఎల్లప్పుడూ నన్నే మనస్సులో ధ్యానించేవాడు. నన్ను విడిచిక్షణంకూడాఉ ండలేనివాడు. అంతటిప్ర ియభక్తునికోరికకాదన్నందుకు నాకు ఆగ్రహం కలిగింది. అందుకే నీవు కొండ విడిచి వెళ్ళలేకపోతున్నావు. నీవు తక్షణమే అతడిని పిలిచి, అతని కోరికను మన్నించి ఇక్కడే హాయిగా ఉండవచ్చునని చెప్పవలసింది. అప్పుడు నీవు, నీ పరివారం ముందుకు సాగి శుభప్రదంగా మీ రాజ్యం చేరుకోగలరు.

ఈవ మాటలువి న్నవ ుహారాజుకుక ునువిప్పుక లిగింది. తానుచేసినత ప్పు అర్థమైంది. శ్రీనివాసుని భక్తవాత్సల్యం ఎంతటిదో అర్థమైంది. ఆ స్వామి తనను ఎవరైనా, ఏమైనా, అన్నా ఊరుకుంటాడేమోకానీ, తన ప్రియభక్తులను ఎవరు ఏమన్నా ఏమాత్రం బాధపెట్టినా ఏమాత్రం ఉపేక్షించడు. వారు ఈ విశ్వంలో ఎంత గొప్పవారైనా సరే, వారిని ఏమాత్రం సహించడు. విక్రమసింహుని విషయంలో అదే జరిగింది. మహారాజు విక్రమసింహుడు వెంటనే చెంపలు వేసుకుని స్వామీ శ్రీనివాసా! నా తప్పు క్షమించు తండ్రీ. నేను ఈ క్షణమే ఆచార్యులవారిని పిలిచి ఇక్కడే సంతోషంగా ఉండమని చెప్తాను అని అన్నాడు. అక్కడితో శ్రీ స్వామివారు శాంతించారు. ఆ పండితుడు మామూలు స్పృహలోకి వచ్చాడు.

విక్రమసింహుడుపి లిపించటంతోఅ క్కడికితి రువేంకటనాథాచార్యులవారు వచ్చారు. మహారాజు అతడికి నమస్కరించి స్వామీ! నా ఆంతరంగిక బృందంలో ఇంతటి గొప్ప శ్రీ స్వామివారి భక్తుడు ఉన్నాడని గ్రహించలేకపోయాను. నన్ను క్షమించండి. మీరు ఈ కొండపైననే క్షేమంగా, శాశ్వతంగా ఉండవచ్చును. మీరుఇ క్కడసు ఖంగాఉ ండిశ్రీ స్వామివారినిసేవించుకొనడానికైవీ ఏకునాలుగు

గ్రామాలు దానం చేస్తున్నాను. ఇప్పటినుంచి ఇక్కడే ఉండి శ్రీ స్వామివారిని సేవిస్తూఇ క్కడేసు ఖంగాఉ ండండిఅ నిఅ న్నాడు. తి రువేంకటనాథాచార్యులు అందుకు ఎంతో సంతోషపడి తాను నిత్యం శ్రీనివాసుని సేవలో తరిస్తానని, ఈ రాజ్యంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని నిత్యం ప్రార్థిస్తానని రాజుతో అన్నాడు.

మహారాజు వెంటనే అశ్వాన్ని అధిరోహించాడు. ఆశ్యర్యంగా అది వెంటనే ముందుకు సాగింది. శ్రీనివాసుని ప్రార్థిస్తూ మహారాజువారి పరివారం కొండదిగి వెళ్ళారు. తిరు వేంకటనాథాచార్యులవారు శ్రీనివాసుని ఆలయంలోనికి వెళ్ళి స్వామివారి ఎదురుగా నిల్చుని ఇలా అన్నారు. ఓ శ్రీనివాసా! నీకు భక్తులంటే ఎంతటి ప్రేమ తండ్రీ. ఈ విశ్వంలో నీ అంత భక్తి వాత్సల్యం కలిగిన దేవుడు మరొకరు లేరు. అతి సామాన్యుడనైన నన్ను అనుగ్రహించావు తండ్రీ. నీకివే నా నమస్కారములు. ఎంతటి వేదాధ్యయనం చేసినవారు కూడా నిన్ను పూర్తిగా అర్థం చేసుకోలేరు తండ్రీ. నీకు కావలసింది గొప్ప గొప్ప యజ్ఞయాగాదులు ఏమాత్రమూ కాదు. కేవలం నిష్కల్మషమైన, స్వచ్ఛమైన భక్తి. నీ అనుగ్రహం ఉన్నవారికి ఇక ఏమీ అక్కర్లేదు స్వామీ. నీ అంత కరుణామయుడైన దైవం మరొకరు లేరు అని శ్రీ స్వామివారిని ఎన్నోవిధాల స్తుతించాడు. అప్పటినుంచి ఆచార్యులవారు కొండమీదనే జీవించసాగారు. ఆలయ అర్చకులందరూ కూడా శ్రీనివాసుని ప్రియభక్తుడైన వీరితో ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. ప్రతీరోజు ఉదయం తిరువేంకట నాథాచార్యులు ఆలయానికి వచ్చి శ్రీనివాసుని ఎన్నో స్తోత్రాలతో స్తుతించేవాడు. ఇది విన్న శ్రీ స్వామివారు ఎంతో సంతోషించేవారు. అలా తిరువేంకటనాథాచార్యులవారు కలకాలం స్వామివారిని సేవిస్తూ కొండపైననే జీవించి చివరికి శ్రీ స్వామివారిలోనే ఐక్యమైనారు.

శ్రీమన్నారాయణుడు సకల దేవతాస్వరూపుడు. ఈ విశ్వంలోని అన్ని దేవతలూ ఆ స్వామి యొక్క రూపాలే. అందువలన మనం ఏ దేవుని కొలిచినా చివరికి ఆ శ్రీమన్నారాయణునికే చెందుతుంది. వేదాలన్నీ ప్రతిపాదించినది ఈ నారాయణతత్వమే. నారాయణుడే పరబ్రహ్మమూర్తి. నారాయణుడే సర్వవ్యాపకుడు. సర్వ విద్యలూ, సర్వ జీవకోటి హృదయాలలో అంతరాత్మ



స్వరూపంలో వున్నది కూడా ఆ నారాయణుడే. శ్రీ వేంకటతత్వాన్ని నిత్యం స్మరించేవారి జన్మ తరిస్తుంది. ఆ తత్వాన్ని నిత్యం తలుస్తుండటం, నిత్యం అర్చిన్స్తున్నందువలననే బ్రహ్మ తన సృష్టికార్యం నిర్విఘ్నంగా నిర్వహించగలుగుతున్నాడు. ఆ అమృత తత్వాన్ని యిసుకరేణువంత తెలుసుకున్నా కూడా అమరత్వం సిద్ధిస్తుంది. నారాయణతత్వం పరబ్రహ్మ స్వరూపమై, కోటిసూర్య తేజోవంతమై ప్రకాశిస్తున్నది. ఆ పరబ్రహ్మమూర్తియే కలియుగంలో భక్తులందరినీ అనుగ్రహించడానికై వేంకటాద్రిపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలసి భక్తుల నిత్యపూజలందుకుంటున్నాడు. తననే నమ్మినవారిని ఎల్లవేళలా రక్షిస్తూ సర్వ సౌభాగ్యాలూ అనుగ్రహిస్తున్నాడు.

శ్రీనివాసుడు దయా సముద్రుడు, ఎవరైతే తనని మనస్ఫూర్తిగా, ఆర్తితో కొలుస్తారో వారికి సర్వ సౌభాగ్యాలూ, సర్వ సంపదలూ, అనుగ్రహించి, ఎల్లవేళలా తానే తోడుగా ఉంటాడు, కలియుగంలో వేంకటేశ్వరుని మించిన దైవం గానీ, వేంకటాద్రికి మించిన పుణ్యక్షేత్రంగానీ లేదు.

శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీనివాసుడు, ఆపద మ్రొక్కులవాడు, అనాథ రక్షకుడు. అతనిని మనసారా కొలచినవారికి ఎటువంటి బాధలు దరిచేరవు. అకాల మృత్యు భయం వుండదు. ఎటువంటి ఆర్థిక, ఆరోగ్య బాధలు పట్టి పీడించవు, శ్రీనివాసుడు అత్యంత దయామయుడు, ప్రతిరోజు కేవలం ఒక్కసారైనా ఆ స్వామిని మనస్సున తలిస్తే చాలు, సర్వ సౌభాగ్యాలూ అనుగ్రహిస్తాడు. ఆ స్వామిని నమ్ముకున్నవారికి ఈ సంసార సాగరం మోకాటి లోతే.

ఆతి రుమలేశునిఅ నుగ్రహంస ంపాదించడంప్ర పంచంలోనిఅ న్నిటికంటే అతి తేలిక. ఏ యజ్ఞాలూ, యాగాలూ అవసరం లేదు, ఏ పదవులూ ఉండనక్కర లేదు, ధనవంతులూ కానక్కరలేదు, కావలసినదల్లా నిష్కళంక భక్తి. గోవిందా అని ఒక్కసారి పిలిస్తే వెంటనే వచ్చి మనల్ని ఆదుకునే అమృతమూర్తి ఆ శ్రీనివాసుడు.

మానవ జన్మ ఎత్తినందుకు గాను ఒక్కసారైనా తిరుమల యాత్ర సంకల్పించి ఆ స్వామిని దర్శనం చేసుకుని జన్మ ధన్యం చేసుకొనవలెను. ఓ శ్రీనివాసా, ఓ శ్రీ వేంకటేశ్వరా, మాకు నీ దర్శన భాగ్యాన్ని అనుగ్రహించు తండ్రీ, నీకివే మా నమస్కారములు.

ఎల్లవేళలయందూ నీయందే మా మనస్సు లగ్నం అగునటుల అనుగ్రహించు తండ్రీ! నీకివే మా శతకోటి ప్రణామములు. ఓ అమృతమూర్తీ! నీకివే మా నమస్కారములు.

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

# శ్రీ లక్ష్మీ, శ్రీ పద్మావతీ సమేత శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !!!



# శ్రీ వేంకటేశ్వర వజ్రకవచమ్

మార్కండేయ ఉవాచః

నారాయణం పరబ్రహ్మ సర్వకారణకారణం
ప్రపద్యే వేంకటేశాఖ్యం తదేవ కవచం మమ
సహస్ర శీర్షా పురుషో వేంకటేశ శ్శిరోవతు
ప్రాణేశః ప్రాణనిలయః ప్రాణాన్ రక్షతుమే హరిః
ఆకాశరాట్ సురానాథ ఆత్మానం మే సదావతు
దేవదేవోత్తమః పాయాద్దేహం మే వేంకటేశ్వరః
సర్వత్ర సర్వకార్యేషు మంగాంబాజాని రీశ్వరః
పాలయేన్మామకం కర్మసాఫల్యం నః ప్రయచ్ఛతు.
య ఏతద్వజ్రకవచ మభేద్యం వేంకటేశితుః
సాయంప్రాతః పఠేనిత్యం మృత్యుం తరతి నిర్భయః

ఇతి మార్కండేయకృత వేంకటేశ్వర వజ్రకవచమ్.